

లక్ష్మీ గణపతి

ఏలూరులోని సత్రంపాడు లక్ష్మీగణపతిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. నవరాత్రులలో భాగంగా జరుగుతున్న ఉత్సవాల్లో మహిళలు సామూహిక గోపూజ, లక్ష్మీ కుబేర వ్రతాలు చేశారు. కరెన్సీ నోట్ల గణపతిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

లడ్డూ వినాయకుడు



చింతలపూడి కొప్పులవారి వీధి వినాయక మండపంలో లడ్డూ గణపతి ఆకట్టుకున్నాడు. 51 కేజీల లడ్డూ వినాయకుడి రూపంలో చేశారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు 7

వరద గోదారి

- మళ్లీ ముంచుతున్న గోదావరి
- భద్రాచలం వద్ద 43 అడుగులు
- దిగువకు పోటెత్తుతున్న వరద
- వేలేరుపాడు మండలంలో 23 గ్రామాలకు రాకపోకలు బంద్
- యంత్రాంగం అప్రమత్తం



వేలేరుపాడు - రుద్రమ్మకోట కాజ్‌వేపై వరద నీరు

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మళ్లీ ముంచుకొస్తోంది. ఎగువన భారీ వర్షాలకు తెలంగాణ ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయిలో నిండడంతో లక్షలాది క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద శుక్రవారం ఉదయం 6గంటలకు 35.20 నీటిఅడుగుల నీటిమట్టం నమోదు కాగా సాయంత్రానికి 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. స్థానిక రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. భద్రాచలం నుంచి దిగువకు 9.5లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో వేలేరుపాడు-కొయిద, వేలేరుపాడు-రుద్రమ్మకోట రహదారి మునిగింది. సుమారు 23గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం వద్ద కడమ్మ స్లూయిజ్ గేట్లు కొంతమేర మూసుకుపోయి ఏటిగట్టు కుడివైపు కొండ వాగుల జలాలు పెరుగుతున్నాయి.



ఏలూరులో తమ్మిలేరు ఉధృతి (ఇన్‌సెట్) కాజ్‌వేపై పోలీసు బందోబస్తు

ఉధృతంగా తమ్మిలేరు

- నిండిన నాగిరెడ్డిగూడెం జలాశయం
- దిగువకు నీరు విడుదల

ఏలూరు క్రైం/చింతలపూడి/చాట్రాయి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెంలో తమ్మిలేరు జలాశయం నిండుతుండడంతో దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. తమ్మిలేరు జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం నీటి మట్టం 348.15 అడుగులు ఉంది. ఎగువ నుంచి 5 వేల క్యూసెక్కుల నీరు వస్తుండడంతో జలాశయం నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. ఈ నీరు ఏలూరు చొదిమెళ్ల ఎఫ్‌సీఐ గోడౌన్స్ నుంచి తంగెళ్లమూడి మీదుగా తూర్పు లాకుల వద్ద నుంచి కొల్లేరులో చేరుతుంది. మరోపాయ శనివారపుపేట కాజ్‌వే, కొత్త బస్టాండ్, పడమర లాకుల నుంచి పోణంగి వైపు వెళ్లి కొల్లేరులో కలుస్తుంది. శుక్రవారం అర్ధరాత్రి నాటికి శనివారపుపేట కాజ్‌వేపై మరింత నీరు ప్రవహించే అవకాశాలు ఉండడంతో ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఇళ్లలో వినాయక చవితి పూజలు చేసినవారు తమ్మిలేరులో నిమజ్జనాలు చేస్తున్నారు. తమ్మిలేరు వద్ద విధుల్లో ఉన్న పోలీసులు వారికి జాగ్రత్తలు సూచిస్తున్నారు.

బార్ దరఖాస్తులకు ముగిసిన గడువు

- పది బార్లకు పూర్తిస్థాయిలో దరఖాస్తులు
- నేడు లాటరీ ద్వారా లైసెన్స్‌ల కేటాయింపులు

ఏలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 ఓపెన్ కేటగిరి, రెండు కల్లుగీత వర్గాలకు సంబంధించిన బార్ లైసెన్సుల కేటాయింపులకు దరఖాస్తు గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 43 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. ఏలూరులో కల్లుగీత బార్‌తో పాటు, ఓపెన్ కేటగిరిలో మూడు బార్లకు నాలుగేసి, జంగారెడ్డిగూడెంలో ఓపెన్, కల్లుగీత బార్లకు నాలుగేసి, చింతలపూడిలో 1 బార్‌కు నాలుగు, నూజివీడులో 3 బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులందాయి. ఒక్కొక్క బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వస్తేనే లాటరీ తీయాలన్న నిబంధన ఉంది. వీటికి దాదాపు లాటరీ తీయడం ఖాయమైనట్టే. మిగిలిన 10 బార్లకు స్పందన లేనందున మళ్లీ నోటిఫికేషన్ ఇస్తారా, గడువు పెంచుతారా అనేది ఒకటి, రెండు రోజుల్లో తేలనుంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి 7 బార్లకు దరఖాస్తులను లాటరీ తీసి వారికి లైసెన్సులు మంజూరు చేయనున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గడచిన 24గంటల్లో అత్యధికంగా ముసునూరు మండలంలో 43 మిల్లీమీటర్ల వర్షపాతం, జిల్లాలో సరాసరి వర్షపాతం 12.5 మి.మీ నమోదైంది. లింగపాలెంలో 42.4, జీలుగుమిల్లి 34.2, చింతలపూడి 28.2, బుట్టాయిగూడెం 21.2, చాట్రాయి 19.2, కామవరపుకోట 17.8, పోలవరం 17.8, కుక్కునూరు 17, భీమడోలు 12.8, ఉంగుటూరు 12.8, జంగారెడ్డిగూడెం 9.6, పెదవేగి 9.4, నూజివీడు 8.2, దెందులూరు 8, నిడమర్రు 7, ద్వారకాతిరుమల 6.4, వేలేరుపాడు 6.4, ఏలూరు రూరల్ 6, ఆగిరిపల్లి 4.6, ఏలూరు అర్బన్ 2.8, టి.నరసాపురం 2, కైకలూరు 1.2, కలిదిండిలో 1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సోమవారం పింఛన్ల పంపిణీ

ఏలూరుసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను సెప్టెంబరు నెలలో 2,61,221 మందికి రూ. 113.36 కోట్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ కె వెట్రిసెల్వి తెలిపారు. పింఛన్ల పంపిణీపై శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం ఉదయం 7గంటలకు పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. అనివార్య కారణాల వల్ల ఆరోజు పెన్షన్లు తీసుకోని వారికి సెప్టెంబరు 2వతేదీన పంపిణీ చేయాలన్నారు.

ఐదుగురు ఎవరు?

టీడీపీ కాబోయే జిల్లా అధ్యక్షుడు ఎవరు..? ఏ సామాజిక వర్గం నుంచి ఎంపిక చేయబోతున్నారు..? ఎవరూ ఊహించని నేతకే పగ్గాలు ఇస్తారా, లేకుంటే అభిప్రాయ సేకరణ చేపట్టి క్యాడర్ అభీష్టానికి అనుగుణంగానే నిర్ణయం జరగబోతుందా.. తుది జాబితాలో తొలి ఐదు పేర్లు ఎవరివి? జిల్లాలో టీడీపీలో ఇప్పుడు ఈ అంశం హాట్ టాపిక్. పార్టీలో ఎవరిని కదిపినా ఇదే మాట.

టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై ఉత్కంఠ



- అధిష్ఠానానికి తుది జాబితా?
- సామాజికవర్గాల సమతూకం
- కాపుల వైపు మొగ్గు అని ప్రచారం
- గన్ని కాకుంటే.. మాకేనంటూ మరికొందరి ఆరాటం
- పరిశీలకులు చేతిలో జాతకాలు
- వారంలోపే కొలిక్కి వచ్చే ఛాన్స్

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు జిల్లా టీడీపీ సారథి ఎంపిక ప్రక్రియ ఉత్కంఠ రేపుతోంది. ఇటీవల అధిష్ఠానం దూతల ముందు ఆశావహులు తమ బలబలాలను వివరిస్తూ దరఖాస్తులు అందించారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులతో పాటు మరో పది మంది రేసులో ఉన్నారు. జిల్లాకు వచ్చిన పరిశీలకులు ఐదు పేర్లతో అధిష్ఠానానికి జాబితా సమర్పించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఆ ఐదుగురు ఎవరు అనేది శ్రేణుల్లో మరింత ఉత్కంఠ కలిగిస్తోంది. ఏ సామాజిక వర్గం నుంచి ఎవరికి ప్రాధాన్యత ఇస్తారనే అంశంపై తర్జనభర్జన సాగుతోంది. రేసులో ఉన్న పది మందిలో వివిధ సామాజిక వర్గాల సీనియర్లతో పాటు జూనియర్లు ఉన్నారు. పార్టీకి అత్యంత విధేయులుగా పేరొందినవారు. తమకంటూ ఒక బాధ్యత అప్పగిస్తే నెరవేర్చి చూపిస్తామని చెబుతున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నా జిల్లా అధ్యక్ష పదవికి అడ్డురాదనకుంటే ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేరు ముందు వరుసలోకి వచ్చే అవకాశం ఉందని పార్టీలో విస్తృత ప్రచారం సాగుతోంది. బడేటి చంటి కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయనకు అవకాశం ఇవ్వాలంటే ఇరుగు పొరుగు జిల్లాల్లో అధ్యక్షుల ఎంపిక బట్టి పార్టీ నిర్ణయం ఉంటుందని భావిస్తున్నారు. అన్ని వర్గాలను కలుపుకునిపోవడంలో చంటికి ఒకింత ప్రాధాన్యం ఉంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని ఐదు విభజిత ప్రాంతాల్లో ఆయా సామాజికవర్గాలను పరిశీలించి తుది నిర్ణయానికి వస్తారని చెబుతున్నారు. పార్టీ వర్గాల్లో ఎమ్మెల్యే చంటి పేరు ప్రధానంగా నానుతోంది. ఎలాగూ సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జిల్లా అధ్యక్ష

మిగతా 8వ పేజీలో..

కోళ్లఫారాలకు పీడీఎస్ బియ్యం!

రూటు మార్చిన అక్రమార్కులు

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

నూజివీడు నియోజకవర్గంలో పీడీఎఫ్ బియ్యం అక్రమ వ్యాపారం వెలుగులోకి రావడం వ్యాపారులు దారి మళ్లిస్తున్నారు. అక్రమ రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. రేషన్‌బియ్యం దందా ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తాత్కాలికంగా దందా నిలిపివేస్తే ముస్ముందు వ్యాపారం సాగదని వ్యాపారులు కోళ్లఫారాల యజమానులతో బేరసారాలు సాగిస్తున్నట్లు సమాచారం. నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దృష్టి సారించడంతో లారీల్లో తరలిస్తే దొరికిపోతామనే భయంతో వ్యాపారులు కోళ్లఫారాల వైపు చూస్తున్నారు. తక్కువ ధరకే రెండు నెలలు బియ్యాన్ని సరఫరా చేస్తామని, లేదా రవ్వగా మార్చి సరఫరా చేస్తామని హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా విజయ లాజరస్

ఏలూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పారిశుధ్యం, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) ఎస్‌ఈగా జి.విజయ లాజరస్ పదోన్నతిపై నియమితులయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన ఈయన విజయవాడలో ఏపీడీడబ్ల్యూఎస్ కార్యాలయంలో ఓడీఎస్ ఈఈగా పనిచేస్తూ పదోన్నతి పొందారు. త్వరలో ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరిస్తారు.

1010 మంది డీఎస్సీ అభ్యర్థుల.. ధ్రువపత్రాల పరిశీలన ఓకే
త్రిపుల్ ఐటీలో క్వాంటమ్ హ్యాకథాన్ 7

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా..

7న శ్రీవారి ఆలయం మూసివేత

8న ఉదయం 9.30 గంటల నుంచి సర్వదర్శనం



ద్వారకాతిరుమల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని వచ్చేనెల 7వ తేదీన మధ్యాహ్నం నుంచి మూసివేస్తామని దేవస్థానం ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆ రోజు మహానివేదన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కవాటబంధనం జరుగుతుందని భక్తులు గమనించాలని కోరారు. ఆ తరువాత రోజు 8వ తేదీన పుణ్యాహవాచనం అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శన అనుమతి లభిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు సూచించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 7న సాయంత్రం శ్రీవారికి జరిగే ఆర్జిత సేవలు, 8న ఉదయం సుప్రభాత సేవలు రద్దు అవుతాయని అన్ని సేవలు యథావిధిగా జరుగుతాయని భక్తులు గమనించాలని కోరారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.10.02 లక్షలు విరాళం

చినవెంకన్న ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన, గోసంరక్షణ పథకాలకు ఓ దాత కుటుంబం శుక్రవారం రూ.10,02,232లను విరాళంగా అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన పద్మలత పరమేశ్వరన్ ఈ విరాళంలో భాగంగా నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5,01,116, గోసంరక్షణ ట్రస్టుకు మరో రూ.రూ.5,01,116 మొత్తం .రూ.10,02,232లను కార్తీక్ పద్మనాభన్ పేరున ఆలయ కార్యాలయంలో జమ చేశారు. వీరికి దేవస్థానం ఏఈవో పి.నటరాజారావు, సూపరింటెండెంట్ కిశోర్ స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాలను కల్పించి సత్కరించారు.



దాత కుటుంబానికి బాండు అందజేస్తున్న ఏఈవో నటరాజారావు

ఈ ఏడాది జనవరి 17వ తేదీన హైదరాబాద్ నుంచి భీమవరం వస్తున్న ఒక మహిళ విజయవాడలో రైలు మారి ప్యాసింజర్ రైలు ఎక్కింది. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌కు వచ్చేసరికి 40 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. బ్యాగులోని నగలను దోచుకున్నారు.

ఫిబ్రవరి 11న విశాఖపట్నం నుంచి మచిలీపట్నం వెళ్లే రైలులో ఒక మహిళ ప్రయాణం చేసింది. ఆకివీడు వచ్చేసరికి ఆమె బ్యాగులో ఉన్న 23 గ్రాముల బంగా రం, ఒక ఫోన్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసింది. గుర్తు తెలియని దుండగులు ఆమెను మాటల్లో పెట్టి నట్టుగా దర్యాప్తులో తేలింది.

ఫిబ్రవరి 24న విశాఖప ట్నం నుంచి గుంటూరు వెళ్లేందుకు ఒక మహిళ రైలు ఎక్కింది. ఆకివీడు వచ్చిన తరువాత చూసేసరికి ఆమె వద్ద ఉన్న 50 గ్రాముల బంగారం, ఒక ఐ-ఫోన్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏప్రిల్ 13న సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను కాకినాడలో ఒక మహిళ ఎక్కింది. ఆ మహిళ తణుకు వచ్చేసరికి బ్యాగులో ఉన్న 77 గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



• రైలు ప్రయాణం.. జరభద్రం..

రైళ్లలో చోరీలకు చెక్!

త్వరలో బోగీలలో సీసీ కెమెరాలకు సన్నాహాలు

» ఇటీవల రైళ్లలో పెరుగుతున్న దొంగతనాలు » కాపుకాసి దోచుకుంటున్న వైనం.. » అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

భీమవరం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గతంలో రైలు ప్రయాణం చేయాలంటే ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా చేసేవారు. ఎంత దూరమైనా కుటుంబంతో ఆనందంగా ప్రయాణించేవారు. ఇటీవల రైలు ప్రయాణాల్లో చోరీల భయం వెంటాడుతుంది. దుండగులు రైళ్లను ఏదో విధంగా సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైళ్లను ఆపి దొంగతనాలకు చేస్తున్నారు. కిటికీల పక్కన ఉండే ప్రయాణికుల మెడలోని వస్తువులు లాగేస్తున్నారు. ప్రయాణికులతోపాటుగా తోటి ప్రయాణికుల మాదిరిగా రైలులో ప్రయాణించే వారిని ఆదమరిచేలా చేసి విలువైన వస్తువులను దోచుకుపోతున్నారు. ఈ రకంగా దొంగతనాలు రోజురోజుకూ పెరిగిపోతూ ఉండడంతో రైలు ప్రయాణం చేయాలంటేనే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఎప్పటికప్పుడు గస్తీలు తిరుగుతున్నప్పటికీ దొంగలు అవేమీ పట్టించుకోకుండా వారి పని కానిచ్చేస్తున్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న దొంగతనాలను దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లకు సన్నద్ధమవుతుంది. ప్రతి బోగీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఇప్పటికే సన్నాహాలు చేశారు. భద్రతను మరింత కట్టుదిట్టంగా పెంచేందుకు పూర్తి స్థాయిలో అధికారులు చర్యలు చేపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వరుస దొంగతనాలతో ప్రయాణికుల ఆందోళన

ఇటీవల ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లను దొంగలు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఆపి దోచుకోవడం చేస్తున్నారు. కొద్దికాలం క్రితం లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను ఆపి దొంగతనానికి ప్రయత్నించారు. అధికారులు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. ఈనెల 25వ తేదీ రాత్రి నరసాపురం-నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ను నిడపూడి జంక్షన్ వద్ద సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలును ఆపి దొంగతనానికి ప్రయత్నించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీసులు అప్రమత్తం కావడంతో దొంగలు పరారయ్యారు. ఈవిధానం వల్ల రైళ్లు నిలిచిపోవడంతో దొంగతనాలు వారికి సులువుగా మారాయి. సిగ్నల్ ట్యాంపరింగ్ అవ్వకుండా ఉండేందుకు రైల్వే శాఖ పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నప్పటికీ దొంగలు ట్యాంపరింగ్ విషయంలో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు.

పెరుగుతోన్న దొంగతనాలు

దొంగతనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఏడాదికి సగటున భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో 20 కేసుల వరకు నమోదవుతున్నాయంటే ఏమేరకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. భీమవరం రైల్వే పోలీస్ స్టేషన్ వేలివెన్ను, నరసాపురం, కైకలూరు వరకు విస్తరించి ఉంది. ఈ పరిధిలో దొంగతనాల సంఖ్య భారీగానే జరుగుతుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో నేరాలను అరికట్టాలంటే పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ కొన్ని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత వేధించడం వల్ల దొంగతనాలు అరికట్టేందుకు వీలు పడడం లేదని కొందరు పోలీసులు చెబుతున్నారు. ఏదిఏమైనా దీనిపై పోలీసులు, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి బోగీలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం మంచి పరిణామం. ఈవిధానం వల్ల దొంగతనాలు అరికట్టేందుకు ఎంతగానో ఉపకరిస్తుంది.

బీట్లు పెంచాం.. చర్యలు తీసుకుంటున్నాం



దొంగతనాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. బీట్లు పెంచి రాత్రిపూట ప్రత్యేకంగా ప్లాట్ ఫారాలపై అనుమానితులను ఉంచకుండా చూస్తున్నాం. పాత నేరస్తులను ఎప్పటికప్పుడు బైండోవర్ చేసి వారిపై ప్రత్యేక నిఘా పెంచాం. రైలు వేగంగా వెళ్తున్నప్పుడు సిగ్నల్ ట్యాంపరింగ్ చేయడం, తర్వాత దొంగతనాలు చేయడం కొందరు దొంగలు చేస్తున్నారు. దానిపై నిఘా పెంచాం. బోగీల వద్ద రైలు వేగం తగ్గుతున్నప్పుడు కొందరు దొంగతనాలకు ప్రయత్నిస్తున్నారు. వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నాం.

- సుబ్రహ్మణ్యం
రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ





సమావేశంలో అధికారులు.. మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వైద్యులు బాధ్యతగా పనిచేయాలి

» ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు క్రైం,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, సీసీ కెమెరాల ద్వారా వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డీసీహెచ్ఎస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులతో ఆమె శుక్రవారం సమీక్షించారు. ప్రభుత్వాసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు జరిగేలా చూడాలన్నారు. మెడికల్ కాలేజీ టెక్నీషియన్లు, టెక్నికల్ పోస్టులను త్వరితగతిన భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన 108 వాహనాలను ఆక్షన్‌వేసి, కొత్త వాహనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మెడికల్ కాలేజీ విద్యార్థులకు వసతి, విద్యా బోధన పట్ల సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మెడికల్ విద్యార్థులు వసతికి ఎటువంటి ఇబ్బందులు లేవని, అయితే సెప్టెంబరు 5వ తేదీ నాటికి మూడో బ్యాచ్ 150 మంది విద్యార్థులు వస్తారని వారికి వేరే చోట అన్ని సౌకర్యాలు ఉన్న వసతి గృహ భవనాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ లోపుగా మాతాశిశు భవనం రెండో ఫ్లోర్లో తాత్కాలికంగా వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఇదే హాస్పటల్‌లో ప్రస్తుతం ఉన్న డీసీహెచ్ఎస్ కార్యాలయాన్ని వేరేచోట భవనానికి షిఫ్ట్ చేసి, ఖాళీ చేసిన భవనాన్ని హాస్పిటల్‌కి అప్పజెప్పాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పీజే అమృతం, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.పాల్‌సతీష్, ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాస్కర్, 108 మేనేజరు డి.రాజు, ఏపీఎంఎస్ ఐడీసీ ఇంజనీరు యూఎస్‌వై రాజబాబు, అధికారులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

» ఉమ్మడి ఐకాస ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్

ఏలూరు,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం సెప్టెంబరు ఒకటో తేదీన నిర్వహించే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు, ఐకాస నాయకులు ఆర్ఎస్ హరనాథ్ పిలుపునిచ్చారు. 2004 సెప్టెంబరు 1వ తేదీన ఆనాటి యూపీయే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నేషనల్ పెన్షన్ స్కీంను 2004 తర్వాత అటు కేంద్రంలో గానీ, రాష్ట్రంలో గానీ ప్రభుత్వ నియమాకాల్లో ఉద్యోగం పొందిన ప్రతీ ఉద్యోగి ఈ నేషనల్ పెన్షన్ స్కీం పరిధిలోకి వస్తారని పీఎఫ్ఆర్‌డీ చట్టాన్ని తీసుకొచ్చి ఉద్యోగులకు సంబంధిత భవిష్యత్‌లో పెన్షన్ లేకుండా.. ఉద్యోగి వాటా కింద పదిశాతం జీతంలో మినహాయించి ప్రభుత్వ వాటా కింద పది శాతాన్ని ఎన్ఎస్‌డీఎల్ ద్వారా సెక్యూరిటీలుగా షేర్ మార్కెట్‌లో పెట్టిందన్నారు. సదరు ఉద్యోగి రిటైరైన తర్వాత పెద్దమొత్తంలో ఉద్యోకి ఇస్తామని ఆ చట్టంలో పొందుపరిచారన్నారు. దీనిపై ఉద్యోగులంతా సమాయత్తం కావాలని కోరారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

» సెప్టెంబరు 5 వరకు దరఖాస్తుల గడువు

ఏలూరుటూటౌన్,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన యువతకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ముక్కంటి తెలిపారు. పురుషుల నుంచి ఐదుగురు, మహిళల నుంచి ఐదుగురికి ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఒక్కో అభ్యర్థి శిక్షణకు అయ్యే ఖర్చు రూ.20వేలు ఎస్సీ కార్పొరేషన్ భరిస్తుందన్నారు. ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. మహిళా అభ్యర్థుల నుంచి ఎటువంటి దరఖాస్తులు రాకపోవడంతో సెప్టెంబరు 5వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నామన్నారు. అభ్యర్థులు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ తీసుకుని ఒక ఏపడాది పూర్తయి ఉండాలన్నారు. కనీస వయస్సు 20-40ఏళ్ల లోపు ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించా లన్నారు. శిక్షణ కాలం 40 రోజులపాటు ఉంటుందన్నారు. వివరాలకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సాయిలక్ష్మి 80196 84966 నంబరులో సంప్రదించాలన్నారు.

రేషన్ సరుకులు సమయానికి అందించాలి

» నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న



గొడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

లింగపాలెం,ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధికారులు రేషన్ సరుకులను లబ్ధిదారులకు సమయానికి అందించేలా చర్యలు తీసుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. శుక్రవారం ధర్మాజీగూడెంలోని ఉన్న పౌరసరఫరాల గొడౌన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గొడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వలు, లెక్కలు, రికార్డుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పంపిణీ విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. గొడౌన్‌లో ఉన్న అక్రమంగా పట్టుబడిన రేషన్ బియ్యాన్ని వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రేషన్ డీలర్లు, గొడౌన్‌లో పనిచేస్తున్న హమాలీ వర్కర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీలలో తహసీల్దార్ నజీముల్లాషా, సివిల్ సప్లై డీటీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ జ్యోతి

'బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం'

భీమవరం క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : 'చదువుకునే వయస్సులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత కలిగి ఉండాలని, ఇతర ఆకర్షణలకు లోనైతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని, బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని' భీమవరం 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ ఎన్.జ్యోతి అన్నారు. ఈనెల 24 నుంచి 30 వరకు బాల్య వివాహాలపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య జూనియర్ కాలేజీలో మెజిస్ట్రేట్ అధ్యక్షతన న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్), 2వ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, పి.అంబేడ్కర్, మీడియేషన్ న్యాయవాది కె.విజయలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీకాంతమ్మ, పీహెచ్‌సీ డాక్టర్ చాందిని, ఎస్టీ హాస్టల్ వార్డెన్ డి.శ్రీనివాస్, కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.తిరుపతిరెడ్డి, కాలేజీ ఏవో భీమారావు, తదితరులు పాల్గొన్నారు. సీఐ కాళీచరణ్ శక్తి యాప్‌పై విద్యార్థినులకు వివరించి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదంలో ఉంటే సెల్‌ఫోన్‌ను మూడుసార్లు చేతితో అడ్డంగా ఊపితే సంబంధిత పోలీస్‌లకు సమాచారం వెళుతుందని, సత్వరమే వచ్చి రక్షిస్తారన్నారు.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం



వందశాతం భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

» 'పీఎంఎఫ్ఎంఈ' తో 35 శాతం రాయితీ

» యూనిట్ల స్థాపనకు శ్రీకారం

ఏలూరుసిటీ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పచ్చళ్లు చేయండి.. పిండిమరలు ఏర్పాటు చేసుకోండి.. మిరప, పసుపు కొమ్ములు పొడులుగా కొట్టండి.. మినీ రైస్‌మిల్, పప్పులమిల్ ఏర్పాటు చేసుకోండి.. పశువుల దాణా తయారు చేస్తామన్నా సరే! ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మీరు చేయాల్సిందల్లా.. ఆసక్తితో ముందడుగు వేయడం, పది శాతం పెట్టుబడి పెట్టి అందులో రాణించేందుకు కృషి చేస్తే మిమ్మల్ని పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం వందశాతం భరోసా కల్పిస్తోంది. ఆర్థికంగానూ ప్రోత్సహిస్తోంది. మీరు పెట్టే యూనిట్‌కు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద 35 శాతం రాయితీ.. గరిష్టంగా రూ.10లక్షల వరకు అందిస్తుంది.

■ **యూనిట్ వ్యయం (రూ.5లక్షల లోపు)**

పిండి మరలు, వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లు , మిరప, పసుపు, మసాలా, కొబ్బరిపొడులు, పూతరేకులు, కొబ్బరి బర్ఫీ, అరటి చిప్స్, రొట్టెలు, కేక్స్, ఇడ్లీ, దోసపిండి తయారీ, ప్యాకింగ్, అప్పడాలు, ఒడియాలు, వేరుశనగ చెక్క, ఫ్లేవర్డ్ మిల్క్, సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లు సహా ఏర్పాటు చేసుకోవచ్చును.

■ **రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు యూనిట్ల వ్యయం..**

వంటనూనెలు, చాక్లెట్లు, నూడిల్స్, సేమియా, చీజ్, పన్నీర్, చిరుధాన్యాల ఆధారిత ఉత్పత్తులు, పండ్ల జామ్, జెల్లీ, చపాతీ, పరోట , అరటి పొడి, పశువుల దాణా తయారీ , డీ హైడ్రేటెడ్ ఫ్రూట్ పౌడర్, మెల్లెట్ పిక్స్, అల్లం-వెల్లుల్లి పేస్ట్, నన్నారి, పానిపూరి తయారీ వంటి ఉత్పత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

■ **రూ. 10లక్షల నుంచి రూ. 20లక్షల లోపు..**

మినీధాన్యం, పప్పు మిల్లులు, జెల్లీ, సాస్, తేనెశుద్ధి, ప్యాకింగ్, ఇన్‌స్టంట్ ప్రిమిక్స్ (గులాబ్‌జామ్, ఖీర్, కేక్ మిక్స్‌లు) నూనెల తయారీ, చిరుధాన్యాల ఆధారిత ప్రాథమిక ఆహార శుద్ధి యూనిట్లు, కొబ్బరి పాల తయారీ మొదలైనవి

■ **రూ.20లక్షల నుంచి రూ. 35 లక్షల లోపు**

ఐస్‌క్రీం, స్క్వాష్‌లు, చపాతి, పరోట, మిల్లెట్, పాస్తా, సోయా ప్రాసెసింగ్, కొబ్బరి సీసాలు, రవ్వ, పిండి యూనిట్లు, పిల్లల పోషకాహారం తయారీ, ఫ్రూట్స్ బార్స్ తదితరాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

■ **రూ.35 లక్షల నుంచి రూ.50లక్షల లోపు..**

కాఫీ ప్రాసెసింగ్, పశువుల దాణా, లెమెన్ ప్రాసెసింగ్, ప్రోబయోటిక్ డ్రింక్స్ , జీడి మామిడి పరిశ్రమలు, చేపలు, మాంసం ప్రాసెసింగ్, మిల్క్ చిల్లింగ్, చెరకు ఆధారిత బెల్లం, మొక్కజొన్న ఆధారిత ఉత్పత్తులు, పండ్ల రసాల యూనిట్లు.

డ్వాక్రా మహిళలకు ప్రోత్సాహకాలు

పొదుపు సంఘాల మహిళలకు ఒక్కొక్కరికి 40 వేల రూపాయల చొప్పున సాయం అందిస్తారు. ముడి సరుకు, ప్యాకింగ్ ఇతరత్రా పెట్టుబడిగా ఉపయోగించుకుని తర్వాత పొదుపు సంఘానికి చెల్లించాలి. వీరు కూడా 35 శాతం రాయితీపై రుణం తీసుకుని యూనిట్‌ను విస్తరించుకోవచ్చు.

దరఖాస్తు, రుణం ఇలా !

జిల్లా, మండల స్థాయిలోని రిసోర్స్‌పర్సన్ ద్వారా వివరాలు తీసుకుని యూనిట్‌కు సంబంధించిన వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి, ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ ఎస్.రామ్మోహన్ తెలిపారు. ఈ దరఖాస్తుకు ఆధార్, పాన్‌కార్డు, యూనిట్ చిరునామా, ధ్రువీకరణపత్రం (విద్యుత్/వాటర్/ఫోన్/ గ్యాస్ బిల్), యూనిట్ నిర్వహించే భవనం/భూమి యాజమాన్య ధ్రువీకరణ వంటి పత్రాలను జతచేయాలి. బ్యాంకు స్టేట్‌మెంట్, యంత్రాలు, షెడ్‌కు సంబంధించిన కొటేషన్లు అప్లోడ్ చేయాలి. దరఖాస్తును రిసోర్స్ పర్సన్ పరిశీలించి జిల్లాస్థాయి కమిటీకి సిఫారసు చేస్తారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే ఈ కమిటీ యూనిట్ వివరాలు పరిశీలించి బ్యాంకుకు పంపిస్తారు. వ్యక్తిగత రుణ చరిత్ర బాగుంటే బ్యాంకు రుణం మంజూరు చేస్తారు. తర్వాత మూడు నెలల లోపు రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. మిగిలిన వివరాలకు 94410 28109, 94932 93109 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భూమిని ఆన్‌లైన్ చేయండి

» రెవెన్యూ కార్యాలయం వద్ద మండపాక రైతు నిరసన



మండపాకలో నిరసన తెలుపుతున్న రైతు ముళ్లపూడి శివరామకృష్ణ

తణుకు రూరల్, అగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ భూమిని ఆన్‌లైన్ చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ తణుకు రూరల్ మండలం మండపాక గ్రామానికి చెందిన రైతు టెంట్ వేసి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండపాక గ్రామ రెవెన్యూ కార్యాలయం వద్ద ముళ్లపూడి శివరామకృష్ణ అనే రైతు తన భూమి సర్వే నంబరు 198-1లో 65 సెంట్ల వ్యవసాయ భూమి వుందని, ఇది గత 60 ఏళ్లుగా తన పూర్వీకుల నుంచి సంక్రమించిందని చెప్పారు. అప్పటి నుంచి తాము సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన దస్తావేజులు పడిపోవడంతో గత ఏడాది డిసెంబరులో జరిగిన రెవిన్యూ సదస్సులో మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేశామన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప తన పొలాన్ని ఆన్‌లైన్ చేయడం లేదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ 65 సెంట్ల భూమి తన అనుభవంలో వున్నట్టు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు కానీ ఆన్‌లైన్ మాత్రం చేయడం లేదన్నారు. మ్యుటేషన్ చేసేందుకు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని దీనితో ఆవేదనతో నిరసన వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై రెవెన్యూ, పోలీసులు రంగ ప్రవేశం చేసి అతడి చర్చించి సమస్యను పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.


ఏఎన్ఎం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు పత్తేబాదలో నిర్వహిస్తున్న ఏఎన్ఎం నర్సింగ్ మహిళా శిక్షణ కళాశాలలో రెండేళ్ల కోర్సుకు ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా రెడ్‌క్రాస్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ జె సత్యనారాయణరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొల్లేరు, గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుందని, ఉచిత భోజన వసతి సదుపాయం కల్పించి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబరు 30లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 94930 56864, 94942 39823 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బైనేరు బ్రిడ్జికి మోక్షమెప్పుడో ?

» పదిసార్లకు పైగా పిలిచిన టెండర్లు.. ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు

ఏడేళ్లు పూర్తయినా నిర్మాణానికి నోచుకోని వైనం..



బైనేరు బ్రిడ్జి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని బైనేరు వాగుపై వంతెన కూలిపోయి ఏడేళ్లవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. 2018లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వచ్చిన భారీ వరదల కారణంగా వందేళ్ల చరిత్ర కలిగిన బ్రిటీష్ ప్రభుత్వంలో నిర్మించిన బైనేరు వంతెన కూలిపోయింది. ఆ వెంటనే 2019లో వచ్చిన ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వంలో రూ.3.5 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. అప్పటినుంచి ఇప్పటివరకు సుమారు పదిసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. నిధులు పెంచకపోవడం మెటీరియల్ కాస్ట్ పెరగడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఇంకా బైనేరు బ్రిడ్జి పనులు ప్రారంభించకపోవడంతో చుట్టుపక్క గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడ్జి పడిపోయినప్పటి నుంచి ఫైర్‌స్టేషన్ పక్కనే ఉన్న అప్రోచ్ రహదారిలో ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. ఆ రోడ్డు ప్రైవేటు సంస్థకు చెందినది కావడంతో ప్రజాప్రతినిధులు స్పందించి ఆ రహదారి నిర్మాణానికి ప్రయత్నించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని పాతబస్టాండు నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లాలంటే ఫైర్‌స్టేషన్ పక్కన ఉన్న అప్రోచ్ రహదారిలో మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాలకు చెందిన ప్రజలంతా ఈ వైపుగానే వెళ్లాల్సిన పరిస్థితి. నిత్యం వంద మీటర్లు ఉన్న అప్రోచ్ రహదారిలో బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్తుండడంతో రహదారంతా ఛిద్రంగా మారింది. అనేకసార్లు పలు ద్విచక్ర వాహనాలు, ఆటోలు తిరబడి ప్రమాదాల బారిన పడిన పరిస్థితులెన్నో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బైనేరు బ్రిడ్జి నిర్మాణంతో పాటు అప్రోచ్ రహదారిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రోచ్ రహదారిని నిర్మించాలి



బైనేరు బ్రిడ్జి కూలిపోయి ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణం చేపట్టలేదు. బైపాస్ రోడ్డుకు అవతల, బ్రిడ్జి పక్కన ఉన్న పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. బైపాస్ రోడ్డుకు వెళ్లాలంటే ఈ అప్రోచ్ రోడ్డు ఒక్కటే మార్గం. గోతులతో అప్రోచ్ రహదారి పూర్తిగా పాడైపోయింది. ప్రభుత్వం అప్రోచ్ రహదారిని త్వరగా నిర్మించాలి. బైనేరు బ్రిడ్జి నిర్మాణం ఆలస్యమవుతుంది.. ప్రభుత్వం బ్రిడ్జి పక్కనుంచి కాజ్‌వే నిర్మాణమైనా చేపట్టాలి.

- కరుటూరి వెంకటేశ్వరరావు, రైతు



ఛిద్రంగా మారిన అప్రోచ్ రహదారి


ట్రోఫీ అందుకుంటున్న ఏలూరు జిల్లా బాస్కెట్‌బాల్ బాలికల జట్టు

బాస్కెట్‌బాల్ ట్రోఫీ విజేత 'ఏలూరు జట్టు'

ఏలూరు రూరల్,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠాత్మకంగా అమరావతి ఛాంపియన్‌షిప్ కప్-2025ను, రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహించింది. ఈక్రమంలో బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో, జోన్2కు సంబంధించి ఏలూరు జిల్లా జట్టు ఫైనల్ పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్‌లో క్రీడాకారులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, క్రీడాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఎంపీ భరత్‌కుమార్, ఎస్ఏపీ చైర్మన్ రవినాయుడు, చేతుల మీదుగా చాంపియన్‌షిప్ ట్రోఫీతోపాటు రూ.లక్ష చెక్కు అందుకున్నట్టు జిల్లా బాస్కెట్ బాల్ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు.


ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో అద్భుత ప్రతిభ కనపర్చి సంస్థకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాస్ అసిస్టెంట్‌లు సంధ్యారాణి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీకి జాతీయస్థాయి 29వ ర్యాంకు

తాడేపల్లిగూడెంరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఇండియన్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్స్ (ఐఐఆర్ఎఫ్)లో 29వ స్థానంలో నిలిచిందని ఉపకులపతి డాక్టర్ బి.గోపాల్ తెలిపారు. జాతీయస్థాయిలో 2,500 విద్యాసంస్థలను మూల్యాంకనం చేసి అందించే ఈ ర్యాంకింగ్ రావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వెబ్‌సైట్‌ల నుంచి ప్రాథమిక పరిశోధన ద్వారా గ్రాడ్యుయేట్ ఫలితాలు, ఉపాధి సామర్థ్యం, బోధనా అభ్యాస వనరులు, పరిశోధనా నాణ్యతలు, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను క్రోడీకరించి జాతీయ స్థాయిలో అందించే ఈ ర్యాంకింగ్స్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారు. ఉపకులపతి గోపాల్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత మెరుగ్గా వర్సిటీని తీర్చిదిద్దుతామన్నారు. ఈ ర్యాంకింగ్ పొందడానికి కృషి చేసిన అధ్యాపక సిబ్బందితోపాటు, వర్సిటీ అధికారులను వీసీ అభినందించారు.

ఆలస్యంగా నడుస్తున్నరైళ్లు

ఏలూరు క్రైం/నరసాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలుకు చెందిన మూడు భోగీలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం గూడ్స్ రైలు భోగీలు పట్టాలు తప్పాయి. ఈమేరకు కోల్‌కత వైపు నుంచి వచ్చే రైళప్లె ఆలస్యంగా వస్తున్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్టణం.. వైజాగ్ నుంచి విజయవాడ వెళ్లే రైళ్లు యథావిధిగానే వెళ్తున్నాయి. విజయనగరం వైపు నుంచి వచ్చే రైళ్లే ఆలస్యంగా నడుస్తున్నాయి. రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు ఆ రైళ్ల కోసం పడిగాపులు పడుతూ ఉన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా లింగంపల్లి ఎక్స్‌ప్రెస్

నరసాపురం నుంచి లింగంపల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఆలస్యంగా బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన రైలు తొమ్మిది గంటలకు బయలుదేరి వెళ్లింది. వర్షాల కారణంగా నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 8 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చింది. దాదాపు ఏడు గంటలు ఆలస్యం కావడంతో లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను నిర్వహణ పనులు చేసి రెండు గంటలు ఆలస్యంగా పంపారు.


నల్ల కండువాలతో నిరసన తెలుపుతున్న కూటమి కౌన్సిలర్లు

రసాభాసగా 'నరసాపురం కౌన్సిల్'

- కమిషనర్ తీరును నిరసిస్తూ చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్ల వాకౌట్
- చైర్‌పర్సన్ తీరును నిరసిస్తూ కూటమి కౌన్సిలర్ల నిరసన
- ఆమోదం లేకుండా అజెండాపై చర్చ

నరసాపురం. ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): నరసాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం స్వపక్ష, విపక్ష సభ్యుల పోటాపోటీ వాకౌట్‌లు, ధర్నాలు, నిరసనలతో హోరెత్తింది. అజెండాలోని అంశాలకు ఆమోదం లేకుండానే సమావేశం ముగిసింది. చైర్‌పర్సన్ బర్రె వెంకట రమణ అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశం ఆరంభంలోనే వైసీపీ సభ్యులు బొంతు రాజశేఖర్ గళం విప్పారు. కౌన్సిల్‌లో తీర్మానాలు, జరిగిన పనులకు ఏడాదిగా ఎందుకు టెండర్లు పిలవడం లేదంటూ కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనికి కమిషనర్ అంజయ్య నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వైసీపీ సభ్యులంతా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ ఏమీ మాట్లాడకుండా బయటకు వెళ్లి గేటు వద్ద ఆందోళన చేస్తున్న వైసీపీ కౌన్సిలర్‌లతో జత కలిశారు.

అదే సమయంలో కౌన్సిల్ హాల్‌లో ఉన్న స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్, వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన గంగరాజు, సీనియర్ కౌన్సిలర్ వన్నెంరెడ్డి శ్రీను, జనసేన సభ్యులు నలుగురు చైర్‌పర్సన్ తీరును తప్పుపట్టారు. సభను నడిపించకుండా సభ్యులతో కలిసి ఆందోళన చేయడాన్ని నిరసిస్తూ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీబొమ్మ వద్ద నల్ల కండువాలు కప్పుకుని నిరసన తెలిపారు. సీనియర్ కౌన్సిలర్ వన్నెంరెడ్డి శ్రీను మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అనేక పనులు ఆమోదం పొందినా టెండర్‌లకు నోచుకోలేదన్నారు. ఆ తరువాత ఎనిమిది మంది సభ్యులు కౌన్సిల్ హాల్‌లోకి వచ్చి అజెండాను చదివించారు. అంశాలపై కొద్దిసేపు చర్చించారు. వీటిని ఆమోదిస్తారో లేదో వైసీపీ కౌన్సిలర్‌లను అడిగి తెలుసుకోవాలని కౌన్సిలర్‌లు వన్నెంరెడ్డి శ్రీను, గంగరాజు, జనసేన కౌన్సిలర్ సురేష్‌లు కమిషనర్‌కు సూచించారు. దీంతో అజెండాలోని అంశాలు ఆమోదం లేకుండా చర్చలతో ముగిసినట్టయింది. ఆర్వో మురళీ, డిఈ ప్రసాద్ పాల్గొన్నారు.

1010 మంది డీఎస్సీ అభ్యర్థుల..

ధ్రువపత్రాల పరిశీలన ఓకే

- అనర్హుల స్థానే తదుపరి మెరిట్ అభ్యర్థులకు సోమవారం కాల్ లెటర్ల జారీ?
- ప్రథమ భాషగా తెలుగు లేకపోవడంతో ఇద్దరు మహిళా అభ్యర్థులకు అగమ్యగోచర స్థితి!
- 7 పోస్టులకు ఎస్సీ కమ్యూనల్ రోస్టర్‌లో అభ్యర్థులు కరవు

ఏలూరు అర్బన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ సెలక్షన్ జోన్ పరిశీలనలోకి వచ్చిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అభ్యర్థులకు తొలివిడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం ముగిసింది. మొత్తం 1074 ఉపాధ్యాయ ఉద్యోగాలకు గాను 1037 మందికి కాల్ లెటర్లు జారీ అయ్యాయి. వీరిలో గురువారం 804 మందికి, శుక్రవారం 233 మందికి ధ్రువపత్రాల పరిశీలనను చేపట్టారు. రెండు రోజుల్లో కాల్ లెటర్లు జారీ అయిన అభ్యర్థుల్లో ముగ్గురు వెరిఫికేషన్‌కు గైర్హాజరయ్యారు. మరో 25 మంది వివిధ రకాల వైకల్య అభ్యర్థులకు వైకల్య ధ్రువీకరణ పత్రాలను(మెడికల్ సర్టిఫికెట్లు) ఏలూరు, గుంటూరు, విశాఖపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల మెడికల్ బోర్డుల నుంచి తీసుకువచ్చిన తర్వాత వారికి కన్ఫర్మేషన్‌ను ఇస్తారు. ఇక స్పోర్ట్స్ కోటా కింద రిజర్వ్ చేసిన 28 పోస్టులకు అభ్యర్థుల ఖరారును ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్)చేపడుతుంది. మరో 7 పోస్టులకు ఎస్సీ (గ్రూప్) కమ్యూనల్ రోస్టర్‌లో సంబంధిత వర్గాల నుంచి అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో ప్రస్తుతానికి వాటిని (స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ) నింపడంలేదు. ఈ పోస్టులను తదుపరి డీఎస్సీకి క్యారీ ఫార్వార్డ్ చేసే అవకాశం ఉంది. వీటితో మొత్తం 1074 నోటిఫై పోస్టుల్లో 1072 నియామకాలపై స్పష్టత రాగా, మరో 2 పోస్టులకు వెరిఫికేషన్ నిమిత్తం శుక్రవారం హాజరైన ఇద్దరు అభ్యర్థుల అర్హతల విషయమై డైలమా నెలకొంది. మొత్తం మీద రెండురోజులపాటు ఉమ్మడి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 1037 మంది అభ్యర్థులను కేటాయించగా, వీరిలో వైకల్య ధ్రువీకరణ పూర్తికావాల్సిన 25 మంది, ఇద్దరి విద్యార్హతల విషయంలో తలెత్తిన డైలమా మినహాయిస్తే మొత్తం 1010మందికి ధ్రువపత్రాల పరిశీలన దశ విజయవంతంగా (కన్ఫర్మేషన్) ముగిసినట్టు భావిస్తున్నారు. మరో ముగ్గురు గైర్హాజరైన విషయం విదితమే.

ఆ ఇద్దరికీ ప్రథమ భాష తెలుగు లేకపోవడంతో...

నోటిఫైడ్ పోస్టుల ప్రకారం ఆయా కేటగిరీల నుంచి సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం కాల్ లెటర్లు జారీ కాగా, ఇద్దరు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో నిబంధనలు అడ్డురావడంతో వారికి కన్ఫర్మేషన్ ఇచ్చే విషయం డైలమాలో పడింది. ఎస్జీటీ పోస్టులకు కాల్ లెటర్లు అందుకున్న ఇద్దరు మహిళా అభ్యర్థుల్లో పాలకొల్లుకు చెందిన ఒకరు పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నవోదయ విద్యాలయలో చదివారు. కేంద్ర విద్యాలయాల్లో ప్రథమ భాష తెలుగు ఉండదు. వీరి విద్యార్హతల్లో తెలుగు ద్వితీయ భాషగా ఉందన్న కారణంతో సంబంధిత అభ్యర్థిని అనర్హుల జాబితాలో చేర్చగా, ఇదే కోవలోకి వచ్చిన మరో మహిళా అభ్యర్థి సీబీఎస్ఈ విద్యావిధానంలో చదవగా ఆమెను కూడా డిస్ క్వాలిఫై చేశారు. వీరిద్దరి అర్హతల విషయంలో ఇటీవల లేవనెత్తిన ఎఫ్ఏక్యూ (ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చన్స్)లో ఉన్నతాధికారులిచ్చిన రూలింగ్ మేరకే అనర్హత నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. కాగా 2001లో మార్గదర్శకాల ప్రకారం తెలుగు ఒక సబ్జెక్టుగా ఉంటే సరిపోతుండగా, తాజా ఎఫ్ఏక్యూలో ఇచ్చిన రూలింగ్ ఇంతకుముందు అమల్లో ఉన్న నియమాలకు విరుద్ధంగా ఉండటం గమనార్హం. కష్టపడి చదివి డీఎస్సీలో అన్ని దశలు దాటుకుని వచ్చినప్పటికీ కేవలం ప్రథమ భాషగా తెలుగులేదన్న సాకుతో అనర్హులుగా చేయడం సబబుకాదని, అధికారులు మానవతా దృక్పథంతో పునరాలోచించి ఈ ఇద్దరు అభ్యర్థులకు న్యాయం చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఇదే విషయమై జిల్లాకు నియమితులైన డీఎస్సీ నోడల్ ఆఫీసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఇద్దరు అభ్యర్థుల విషయమై గ్రీవెన్స్ సెల్‌కు, ఉన్నతాధికారులకు వివరణ నిమిత్తం తెలియజేశామని, ఇంకా తుది నిర్ణయమేదీ తీసుకోలేదని స్పష్టం చేశారు.

సోమవారం కాల్ లెటర్లు?

తొలివిడతలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గైర్హాజరైన ముగ్గురితోపాటు, 28 మంది స్పోర్ట్స్ కోటా, వైకల్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సిన 25 మంది అభ్యర్థుల్లో ఎవరైనా అనర్హులుగా నిర్ధారణైతే, వారిస్థానంలో తదుపరి మెరిట్ అభ్యర్థులకు కాల్‌లెటర్లు జారీచేసే ప్రక్రియ సోమవారం జరిగే అవకాశం ఉంది. అనర్హులుగా నిర్ధారణ అయిన సందర్భంలో ఆయా వర్గాలకు రిజర్వ్ చేసిన సంబంధిత పోస్టులకు తగిన అర్హతలుగల అభ్యర్థులు లేకపోతే వాటిని జనరల్ కేటగిరీలోకి చేర్చి అర్హతలుగల వారితో భర్తీచేసే అవకాశం ఉంది. ఇలా రెండో విడత కాల్‌లెటర్లు అందినవారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఏలూరు డీఈవో కార్యాలయంలో చేపడతారు. రెండో విడత కాల్ లెటర్ల జారీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై అధికారికంగా సమాచారమేదీ లేదు. శుక్రవారం ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కాకినాడ ఆర్జేడీ నాగమణి, నోడల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ వెంకట లక్ష్మమ్మ, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి జిల్లాల డీఈవోలు నారాయణ, వాసుదేవరావు, తదితరులు పర్యవేక్షించారు.

2న మాధవ్ శోభాయాత్ర

రూట్ మ్యాప్‌ను పరిశీలించిన బీజేపీ జిల్లా నాయకులు

భీమవరం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సారథ్యం యాత్రలో భాగంగా వచ్చే నెల 2న భీమవరం వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటనను ప్రతి బీజేపీ కార్యకర్త విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు కోరారు. భీమవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. సుమారు 5 వేల మంది సారథ్యం యాత్రలో పాల్గొంటారని వినోద్ వర్మ తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ నాడు ఉదయం చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం 10 గంటలకు భీమవరం మునిసిపల్ ఆఫీస్ నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అక్కడ నుంచి వెంకటరామ థియేటర్ రోడ్డు, ప్రకాశం చౌక్, అంబేడ్కర్ సెంటర్ మీదుగా ఆనంద ఫంక్షన్ హాల్ వరకు యాత్ర సాగుతుందని ఈ యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటారని అన్నారు. మధ్యాహ్నం ఆనంద ఫంక్షన్ హాల్‌లో జరిగే జిల్లా విస్తృత స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా మాధవ్ పాల్గొంటారన్నారు. పర్యటన ఏర్పాట్లను జిల్లా కార్యదర్శి ఆకుల లీలా కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కే. సురేంద్ర, జిల్లా ఐటీ కన్వీనర్ షేక్ మొహిద్దీన్ రాజ్, బీజేపీ నాయకుడు భూపతిరాజు సుబ్బరాజు తదితరులు పరిశీలించారు.


పట్టణంలో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ వర్మ తదితరులు

బాలికపై లైంగికదాడి.. 20 ఏళ్ల జైలు

ఏలూరు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి కె.వాణి శ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు.ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన పిల్లే వెంకటేశ్వరరావు అలియాస్ నంద(37)2018 డిసెంబర్ 22న బాలికపై లైంగికదాడి చేశాడు. బాలిక ఏడుస్తూ ఇంటి నుంచి బయటకు రావడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా వెంకటేశ్వరరావు లైంగికదాడి చేసినట్టు గుర్తించారు. దీనిపై జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు టి.నర్సాపురం పోలీసులకు ఆ కేసును అప్పగించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ మురళీకృష్ణ కేసు దర్యాప్తు చేసి ఈ కేసులో నిందితుడైన వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ జరిగింది. నాలుగేళ్ల బాలికపై పిల్లి వెంకటేశ్వరరావు లైంగికదాడి చేసినట్టు నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి వాణిశ్రీ తీర్పు చెప్పారు. బాధితురాలి కుటుంబానికి రూ.50 వేల పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

యువకుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు

లింగపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పనుల నిమిత్తం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కూలీల్లో ఒక యువకుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామంలో విద్యుత్ పనుల నిమిత్తం మధ్యప్రదేశ్ నుంచి ఇరవై మంది కూలీలు వచ్చారు. వారిలో మనోజ్ కుమార్ అనే యువకుడు ఇంటికి వెళ్లాడు.ఇంటికి ఫోన్ చెయ్యగా రాలేదని కుటుంబ సభ్యులు తెలపడంతో మేస్త్రి కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ

లింగపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): లింగపాలెం శివారులో వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని రాగివైరును అపహరించారు. స్తంభాలపై అమర్చిన ట్రాన్‌ఫార్మర్‌లను కిందపడేసి వాటిలో లక్షా 60 వేల విలువైన రాగి వైరును దొంగిలించుకెళ్లారు. ఉదయం పొలాల వద్దకు వచ్చిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌కు సమాచార అందించడంతో ఆయన వాటిని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.


పెదనింద్రకొలనులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రంజిత్ కుమార్

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ఏలూరు,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో విజిలెన్స్, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఎరువుల దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఏకకాలంలో చేపట్టిన ఈ దాడుల్లో పలుచోట్ల ఎరువులను సీజ్ చేశారు. భీమడోలు మండలం కురెళ్లగూడెంలో కృష్ణ ట్రేడర్స్ ఉమాలక్ష్మి ట్రేడర్స్, నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో విఘ్నేశ్వర ట్రేడర్స్‌ల్లో తనిఖీలు చేయగా, విజయ ట్రేడర్స్‌లో 17వేల 233 విలువైన 0.735 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. షాపు యజమానిపై నిత్యావసరాల చట్టం కింద 6(ఏ) కేసు, క్రిమినల్ కేసు నమోదు చేశారు. కృష్ణ ట్రేడర్స్‌లో లక్షా 21వేల 25 విలువైన 7.750 టన్నుల ఎరువులు వ్యత్యాసం గుర్తించి సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు, ఎస్ఐ రంజిత్‌కుమార్, కె సీతారాము, విజిలెన్స్ తహశీల్దార్ కన్యాకుమారి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ హ్యాకథాన్

నూజివీడు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలో గల నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్వాంటమ్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించి వివిధ అంశాలపై ఈ హ్యాకథాన్‌ను నిర్వహించగా, దాదాపు 33 టీంలు రిజిస్టర్ అయ్యాయి. 29 టీమ్‌లు 10 అంశాలకు సంబంధించి తమ ఐడీయాలజీని అధికారిక పోర్టల్లో సమర్పించగా, 25 టీమ్‌లు హ్యాకథాన్‌లో పాల్గొని తమ సృజనాత్మకతలను ప్రదర్శించాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించి ఫ్రాడ్ డిటెక్షన్, స్ట్రీట్ ఆప్టమైజింగ్, క్వాంటమ్ కీ, డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై ఈ హ్యాకథాన్‌ను నిర్వహించగా, ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచిన ఐదు టీంలను ఎంపిక చేశారు. దీనిలో క్యూక్వాడ్ అనే టీమ్ పూర్తిగా విద్యార్థినులతో ఉండటం విశేషం. కాగా ప్రతిభ కనబరిచిన టీంలు అమరావతి, క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్, 2025లో ఆర్జీయూకేటీకి ప్రాతినిధ్యం వహించనున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు.


ఆర్డీవో కార్యాలయం

ఆర్డీవో , డీఎస్పీ కార్యాలయాలకు స్థలం గుర్తింపు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలకు స్థలాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు. ఇప్పటికే ఆర్డీవో కార్యాలయం ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో ఉండగా డీఎస్పీ కార్యాలయం అద్దె భవనంలో నడుస్తోంది. సొంత భవనాల ఏర్పాటుకు స్థలం చూడాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు ఆదేశించగా విమానాశ్రయ భూముల్లో రెండెకరాలను గుర్తించి వాటి వివరాలు పంపించారు. ప్రస్తుతం ఆ భూములు నన్నయ్య విశ్వవిద్యాలయ క్యాంపస్ సమీపంలో స్టేడియం కోసం ఎంపిక చేసిన ప్రాంతానికి చేరువలో ఉంది. ఆ స్థలం ఆమోదితమైతే ప్రత్యేకంగా ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలు సొంత భవనాల నిర్మాణానికి అవకాశం లభిస్తుంది.


అద్దెభవనంలో ఉన్న డీఎస్పీ కార్యాలయం


కూర్చోవడానికి కుర్చీలు లేక నిల్చున్న అర్జీదారులు


సిమెంటు దిమ్మెమీద


బిడ్డను ఎత్తుకుని క్యూలో నిల్చున్న మహిళ

కస్సు...బుస్సు..

సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులపై సిబ్బంది తీరిది..

కూర్చోవడానికి కుర్చీలు, తాగడానికి నీళ్లు, మరుగుదొడ్ల సౌకర్యం లేక అవస్థలు

ఏలూరు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వారంతా దివ్యాంగులు..ఎన్నో ఏళ్లుగా తమ అంగ వైకల్యానికి ధ్రువీకరణ పత్రం ఆధారంగా పెన్షన్ పొందుతున్నారు. కొంతమందికి అప్పట్లో ఉన్న వ్యాధి నయమయ్యి ఆరోగ్య వంతులుగా మారిపోయారు. మరికొంత మందికి క్రమేపీ వ్యాధి ముదిరి వైకల్యం మరింత పెరిగింది. ఇంకా కొంత మందికి రోడ్డు ప్రమాదాల్లోనూ,ఇతర కారణాలతో వైకల్యాన్ని పొందారు.గతంలో మానసిక విభాగం నుంచి సర్టిఫికెట్ పొందిన వారికి పక్షవాతం వచ్చి కాలు, చేయి పడిపోవడంతో వారు వీల్ చైర్లకు పరిమితమయ్యారు. ఇప్పుడు ఇలాంటి వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వైసీపీ పాలనలో అనేక దొంగ సర్టిఫికెట్లు పెట్టి పెన్షన్లు పొందుతున్నారని ఫిర్యాదులు అందడంతో అంగ వైకల్య నిర్ధారణ నిమిత్తం సదరం సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయిస్తున్నారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో ఈ ప్రక్రియ ఈ ఏడాది జనవరి నుంచి ప్రారంభించారు. డిసెంబర్ వరకూ ప్రణాళికా బద్దంగా అన్ని మండలాలకు వివిధ ఆసుపత్రులను కేటాయించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియను డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మొదటిలో ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద టెంట్లు వేసి చైర్స్ వేసేవారు. క్రమేపీ కనీస సౌకర్యాలు కల్పించడం మానివేశారు. తూతూ మంత్రంగా పది చైర్లతో సరిపెట్టేస్తున్నారు. వచ్చిన వారికి కనీసం తాగునీటి సదుపాయం కూడా లేదు. మానసిక అంగవైకల్యం కలిగిన దివ్యాంగుల వెంట కుటుంబ సభ్యులు తోడుగా వచ్చారు. వారిని ఏదో ఒక ప్రాంతంలో కూర్చోబెట్టి అప్లికేషన్ నమోదు ప్రక్రియను చేయించుకుంటున్నారు. కూర్చోడానికి కుర్చీలు లేక గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. డీఆర్డీఏ సిబ్బంది మాత్రం వచ్చిన వారిపై కస్సుబుస్సుమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దివ్యాంగులకు నరకం చూపిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మండవల్లి మండలం నుంచి వచ్చిన వారికి కొంతమందికి దరఖాస్తులను రీవెరిఫికేషన్ కోసం నమోదు చేసి మిగిలిన వారు మరో రోజు రావాలనడంతో వారు ఆగ్రహించారు.తామంతా దివ్యాంగులమని అతి కష్టం మీద వచ్చామని, ఇప్పుడు వెళ్లిపోమంటే ఎట్లా అని ప్రశ్నించారు. అయితే సచివాలయం సిబ్బంది ఒకేరోజు 180 మందిని పంపించారని వాస్తవానికి విభాగానికి 30 మందిని మాత్రమే వైద్యులు చూస్తారని చెబుతున్నారు. డీఆర్డీఏ అధికారులకు సచివాలయ సిబ్బందికి సరైన అవగాహన లేక దివ్యాంగులను ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దివ్యాంగుల కుటుంబ సభ్యులు వారితో వాగ్వివాదానికి దిగడంతో చివరకు అందరికీ రీ వెరిఫికేషన్ కోసం నమోదు చేశారు. చివరకు మూత్ర విసర్జనకు వెళ్లడానికి కూడా సమీపంలో ఏమి లేవు.పెయిడ్ సర్వీసులో ఆసుపత్రి బయట ఉన్న సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణం పరిశీలించి రీ వెరిఫికేషన్‌కు వచ్చే దివ్యాంగులకు కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.


బిడ్డకు మంచినీళ్లు అందిస్తున్న తల్లి

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దు

మెడికల్ షాపుల యజమానులకు ఎస్పీ కిశోర్ దిశానిర్దేశం

ఏలూరు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎన్ఆర్ఐ విభాగానికి చెందిన ఔషధాలను విక్రయించకూడదని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ ఆదేశించారు. రాష్ట్ర ఈగల్ ఐజీ ఎ.రవికృష్ణ ఆదేశాలతో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా మెడికల్ షాపుల యజమానుల అసోసియేషన్ సభ్యులకు డ్రగ్స్ అమ్మకాలపై, వినియోగంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఏలూరు జిల్లాలో ఒక ప్రాంతంలో అబార్షన్ కిట్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్న విషయాన్ని గుర్తించామని, ఇలాంటి షాపుల్లో తనిఖీలు చేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. షాపుల్లో పనిచేసే వారిపట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వారిపై గతంలో ఏమైనా నేర చరిత్ర ఉందా లేదా అనే విషయాలపై పోలీస్ వెరిఫికేషన్ చేయించాలన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల కోసం వస్తే విక్రయించవద్దన్నారు. ఎస్ఆర్ఎక్స్ ఔషధానికి సంబంధించి రోగి పేరు, చిరునామా, తేదీ, డాక్టర్ వివరాలు వంటివి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ రిజిస్టర్ రెండు సంవత్సరాల పాటు భద్రపర్చాలన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ గతంలో ఆపరేషన్ గరుడ ద్వారా ఏలూరు జిల్లాలో ఐదు షాపులపై కేసులు నమోదు చేశామని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ ఉదయభాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్


నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చల్లావారిగూడెం గ్రామానికి చెందిన బర్ల శ్రీనివాస్ కొంతకాలంగా మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్నాడు. నిందితుడు స్థానిక మార్కెట్‌యార్డు వద్ద ఉన్నట్టు సమాచారం అందడంతో జంగారెడ్డిగూడెం పోలీసులు దాడి చేసి శుక్రవారం అరెస్టు చేశారు. శ్రీనివాస్ నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపర్చగా రిమాండు విధించినట్టు ఇన్‌చార్జి ఎస్.ఐ. కుటుంబరావు తెలిపారు.

● మహా గణపతికి ప్రత్యేక పూజలు



భీమడోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి ఉత్సవాలు మూడవ రోజు వైభవంగా జరిగాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ తదితర గ్రామాల్లో గణనాథులకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమడోలు గణపతి సెంటర్‌లో ఉన్న మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కైకరంలో సీజనల్ వ్యాధులపై అవగాహన

ఉంగుటూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే సీజనల్ వ్యాధులను అరికట్టగలమని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం కైకరం సచివాలయంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రతతో ఉంచుకోవడంతో పాటు నీటిని నిల్వ ఉంచొద్దని ప్రజలకు హితవు పలికారు. ఆరోగ్య కార్యకర్తలు సునీత, ప్రీతి, ఆశాలు వరలక్ష్మి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయండి

బుట్టాయగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సెప్టెంబరు 1న నిర్వహిస్తున్న ఛలో విజయవాడను జయప్రదం చేయాలని సీపీఎస్‌ఈఏ మండల కార్యదర్శి వెలుగు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఛలో విజయవాడకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం బుట్టాయగూడెంలో విడుదల చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, సీపీఎస్‌పై నిర్ణయం తీసుకోలేదని, డీఏ బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వంపై వత్తిడి తేవడానికి సెప్టెంబరు 1న జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

● జంగారెడ్డిగూడెం: సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రచార పత్రికలను బాలికల ఉన్నత పాఠశాల, మండల పరిషత్ కార్యాలయం ట్రెజరీ, మున్సిపల్ కార్యాలయాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యమంలో ఉద్యోగులంతా భాగస్వాములు కావాలన్నారు.

కంటి విభాగానికి ప్రొఫెసర్‌గా కిరణ్మయి నియామకం

ఏలూరు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కంటి విభాగానికి ప్రొఫెసర్‌గా ఎం.కిరణ్మయిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా కంటి విభాగంలో పనిచేస్తున్న వారిలో 11 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతులను కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల్లో జారీ చేశారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో కంటి విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కిరణ్మయికి ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించి ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పోస్టింగ్ ఇచ్చారు.

అక్షరాస్యతపై వలంటీర్లకు శిక్షణ

దెందులూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యత సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం నవభారత్ సాక్షరత కింద ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఏలూరు జిల్లా వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి విజయ్ కుమార్ తెలిపారు. దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కంతేటి శ్రీదేవి ఆధ్యక్షతన మండల స్థాయిలో వలంటీర్లకు శుక్రవారం శిక్షణను ఏపీఎం సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.విజయ్ కుమార్, శ్రీదేవిలు మాట్లాడుతూ మండలంలో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాయన్నారు. మండల విద్యాశాఖాధికారి ప్రసాద్, అంగన్వాడీ సూపర్ వైజర్ చిట్టమ్మ పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమమే అంగన్‌వాడీల లక్ష్యం

పెదవేగి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలని పెదపాడు ఇన్‌చార్జ్ సీడీపీవో ఎస్.కె. ఫాతిమా ఉన్నీసా బేగం అన్నారు.పెదవేగిలో శుక్రవారం జరిగిన అంగన్‌వాడీ పెదవేగి సెక్టార్ సమావేశంలో పాల్గొన్న ఆమె చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని, గర్భిణులు బాలింతల ఆరోగ్యానికి సూచనలు చేయాలన్నారు. పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

పెదవేగి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సాగులో తీసుకునే జాగ్రత్తల వల్లే అధిక దిగుబడులు సాధ్యమవుతుందని ఏలూరు ఏడీహెచ్ సంతోష్ అన్నారు. పెదవేగి మండలం పెదకడిమిలో శుక్రవారం పొలంబడిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీహెచ్ సంతోష్ మాట్లాడుతూ ఎరువుల నిర్వహణలో భూసార పరీక్షలు కీలకమన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి, దాని ఆధారంగా ఎరువుల వాడకం చేపడితే భూసార పరిరక్షణతో పాటు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని చెప్పారు. డీఆర్‌సీ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ వరిపంటలో నత్రజని ఎరువుగా యూరియాకు ప్రత్యామ్నాయంగా అమ్మోనియమ్ సల్ఫేట్‌ను వాడుకోవచ్చాని చెప్పారు. అమ్మోనియమ్ సల్ఫేట్ వాడితే పంటకు నత్రజనితోపాటు గంధకం కూడా లభిస్తుందని, తద్వారా ఆశించిన దిగుబడిని రాబట్టవచ్చని ఆయన సూచించారు. పెదకడిమి సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, కొప్పాక సొసైటీ చైర్మన్ కొసరాజు వీరవెంకట వరప్రసాద్, పెదవేగి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారిణి ఎం.రత్నమాల పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కూటమి ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా వైద్యం చేయించుకునేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుదిమెళ్లకు చెందిన దూలం రాంబాబుకు రెండు మోకాళ్లకు ఆపరేషన్ నిమిత్తం కుటుంబ సభ్యులకు నాలుగు లక్షలు రూపాయలు ఎల్‌ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరకాలంలోనే నియోజకవర్గంలో రెండుకోట్లకు పైగా సీఎం సహాయనిధి నుంచి పేదలకు వైద్యం అందిస్తామన్నారు. భవిష్యత్తులో కూడా పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా వైద్యానికి అయ్యేఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

అప్పలరాజుగూడెం రోడ్డును అభివృద్ధి చేయండి



గోతులతో అధ్వానంగా ఉన్న రోడ్డు

టి.నర్సాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుగూడెం రోడ్డు అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. రోడ్డు దుస్థితిపై శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం నుంచి టి.నర్సాపురం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైందని తెలిపారు. రోడ్డు పొడవునా గోతులు ఏర్పడటంతో వాహనదారులు రోడ్డు పై వాహనాలు నడపటానికి తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించి రోడ్ల సమస్యకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు కనీసం గుంతలైన పూడ్చే కార్యక్రమం చేపట్టాలని కోరారు.

ఐదుగురు ఎవరు?

(5వ పేజీ తరువాయి)

బాధ్యతలను భుజానెత్తుకోవడానికి సుముఖంగా లేరు. పార్టీ నాయకత్వం పట్టుబడితే ఆయన కూడా మెత్తబడే అవకాశం లేకపోలేదు. దీనికి తోడు బీసీ సామాజికవర్గం నుంచి అధికార ప్రతినిధి శ్యామ్‌చంద్ర శేషు కూడా పోటీ పడుతున్నారు. ఆయన యువత, బీసీ కోటాలో ప్రాధాన్యత లభిస్తుందని ఆశతో ఉన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులంతా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే. కానీ గౌడ సామాజిక వర్గం నుంచి తనకు ప్రాధాన్యత ఇవ్వాలని శేషు కోరుకుంటున్నాడు. మరోవైపు ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుకు అవకాశం లేకపోతే తమకు అవకాశం ఇవ్వాలని కోరే వారి సంఖ్య పెరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ కూడా తనకు ఒక ఛాన్స్ ఇస్తే సమర్థతను నిరూపించుకుంటానని చెబుతున్నారు. దీనికి తోడు ఇప్పుడున్న పరిస్థితుల్లో అన్ని నియోజకవర్గాల్లో కేడర్‌ను సమన్వయం చేయడంలో తాను ఇప్పటికే సక్సెస్ అయ్యాయని గన్ని బలమైన అభిప్రాయంతో ఉన్నారు. ఈ కారణంగానే తనను మరోసారి కొనసాగించేందుకు అధినాయకత్వం నిర్ణయం తీసుకోవచ్చుననే ఆశతో ఉన్నారు. నూజివీడు నియోజకవర్గానికి చెందిన అట్లూరి రమేష్ సైతం సీనియర్లతో భేటీ అయ్యారు. తనకు అవకాశం ఇస్తే పార్టీ కార్యక్రమాలను మరింత బలంగా గ్రామస్థాయి వరకు తీసుకువెళతానని వాదన వినిపిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో తాను సేవా కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన రామ్‌కుమార్, ఉంగుటూరుకు చెందిన రెడ్డి చందు కూడా తమకు ఒక అవకాశం ఇవ్వాలని గట్టిగానే పట్టుబడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి జడ్పీ మాజీ చైర్మన్ కొక్కిరగడ్డ జయరాజు, దాసరి అంజనేయులు రేసులో ఉన్నారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ : కొత్త జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఎప్పటిలోగా పూర్తవుతుందనే దానిపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. జిల్లా పరిశీలకులు ఇచ్చిన తొలి ఐదు పేర్లను పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు అధినాయకత్వం అన్ని విషయాలను క్షుణ్ణంగా శోధించి తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. తొలి ఐదు పేర్లలో ఎవరెవరున్నారనే దానిపై మాత్రం పార్టీలో రకరకాల పేర్లు షికార్లు చేస్తున్నాయి. కాపు సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యే చంటి పేరు తొలి వరుసలో ఉందని చెబుతున్నారు.

పనులు చేపట్టండి మహాప్రభో..

ముందుకు కదలని బోయగూడెం -సీతానగరం రోడ్డు పనులు
11 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు

చింతలపూడి,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బోయగూడెం -సీతానగరం రోడ్డు కోసం ఇరవై ఏళ్ల నుంచి ధర్నాలు జరిపి విజ్ఞప్తులు అందజేశారు. గ్రామ సభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు నాబార్డు నుంచి 20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో చేపట్టాల్సిన పని శంకుస్థాపన జరిపి అదిగోఇదిగో అంటూ వదిలేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఈ రోడ్డుకు మోక్షం కలిగింది. గత ఏడాది ఆగస్టులో పనులు ప్రారంభించినా పనులు నత్తనడకలా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. చదువుకునే విద్యార్థులు ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లను ఆశ్రయించి ఇటు చింతలపూడి, అటు రాఘవాపురం వెళ్లి 20 ఏళ్లు చదువులు పూర్తి చేశారు. ఇప్పుడు వస్తున్న తరానికైనా దారి చూపండంటూ కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఈ రోడ్డు 16 కిలోమీటర్ల పొడవున నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ మార్గంలో 11 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఇందులో అధిక భాగం గిరిజనులు, దళితులే నివసిస్తుంటారు. ఈ రోడ్డు నిర్మాణంలో 22 కల్వర్టులు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 18కల్వర్టులు నిర్మించారు. గ్రామాల పరిధిలోని రోడ్లను సీసీ రోడ్లుగా మొత్తం 3.8 కిలోమీటర్లు నిర్మాణం పూర్తి చేశారు. వీటితో పాటు పట్టాయిగూడెం, అగ్రహారం గ్రామాల్లోని చెరువుల నుంచి ముంపు రాకుండా రిటైనింగ్ వాల్‌లను నిర్మించారు. ఏడాదిలో పూర్తికావాల్సిన పనులు ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే పూర్తయ్యాయి. చేపట్టిన పనుల్లోనూ నాణ్యతలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గంలోని వెంకటాపురం, వెంకటాద్రిగూడెం, నామవరం పంచాయతీలకు చెందిన 11 రెవెన్యూ గ్రామాల ప్రజలు కాంట్రాక్టర్ల తీరుపై మండిపడుతున్నారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకంలో ఇచ్చిన బస్సు సర్వీసులు లేక పథకానికి నోచుకోవడం లేదు. మరోవైపు రోడ్డు వేస్తేనే బస్సులు తిప్పుతామని ఆర్టీసీ అంటుంది. దీంతో ఈ రోడ్డు పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రోడ్డు విషయమై ఏఈ చైతన్యను ప్రశ్నించగా ఏడాదిలో పనులు పూర్తికావాల్సి ఉన్నా ఇప్పటి వరకు 40శాతమే పూర్తయ్యాయని, ఇంకా నాలుగు కల్వర్టులు పూర్తిచేస్తేనేగాని రోడ్డు వేయడానికి లేదని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు.



పట్టాయిగూడెం వద్ద నిర్మించిన రిటైనింగ్ వాల్

కాలయాపన చేస్తున్నారు



20 ఏళ్లుగా రోడ్డు కోసం ఎదురు చూస్తున్నాం. పనులు వేగంగా సాగడంలేదు. ఈ రోడ్డులోని గోతులను పూడ్చడం లేదు. కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే మూడేళ్ల గడువు ఉందని చెబుతున్నారు. అంటే అప్పటివరకు ఈ రోడ్డు పూర్తికాదా. ఉచిత బస్సు కోసం మహిళలు అడుగుతున్నారు. నాయకులమైన మేము ఏం చెప్పాలో అర్థంకావడంలేదు.

ఆది సత్యనారాయణ,
మాజీ సర్పంచ్, వెంకటాపురం



సీఆర్‌ఆర్‌లో శరత్‌చంద్రను సత్కరిస్తున్న దృశ్యం



గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసిన దృశ్యం

తెలుగు భాష గౌరవాన్ని నిలపండి

తెలుగు భాషా దినోత్సవంలో వక్తలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని శుక్రవారం నగరంలోని పలు విద్యాసంస్థల్లో నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ నతానియేల్, వి.వి.స్వామి మాట్లాడుతూ సవరభాషకు గిడుగు చేసిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, అధ్యాపకులు పరమేశ, వెంకట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో నూతన విద్యావిధానం - మాతృభాష అనే అంశంపై అతిథి ఉపన్యాసమిచ్చిన రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ శరత్ చంద్ర మాట్లాడుతూ ప్రపంచంలో అందమైన భాషల్లో తెలుగు ప్రథమ స్థానంలో ఉందన్నారు. అతిథిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్,ప్రిన్సిపాల్ రామరాజు, తెలుగు హెచ్‌వోడి శ్రీనివాసరావు, సత్కరించారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన తెలుగులో మాండలికాలనే అంశంపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ, శ్రీకాకుళం, తదితర ప్రాంతాలకున్న మాండలీకాలను,ఆ ప్రాంతాల సంస్కృతులను విద్యార్థినులు నాటిక, నృత్యాల ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలుగు,హిందీ హెచ్‌వోడి మహాలక్ష్మి, అధ్యాపకులు అరుణ ఝాన్సీరాణి, అరుణ పాల్గొన్నారు. ఆర్‌ఆర్ పేట శ్రీశర్వాణి స్కూల్లో ఏకాదశ సహస్ర గళార్చన - తెలుగు శతకాన్ని బాలబాలికలు రాగయుక్తంగా ఆలపించారు. హెచ్‌ఎం సత్యశారద, డైరెక్టర్ మదనమోహనరాజు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: తెలుగు భాషా దినోత్సవాన్ని వైఎంహెచ్ఏ హాల్లో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి, తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష గొప్పతనాన్ని పెంపొందించాలని యార్ర సోమలింగేశ్వరరావు, కేవీ సత్యనారాయణ, యిరదల ముద్దుకృష్ణ, మజ్జి సూర్య కాంతరావులు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులు ఎల్ వెంకటేశ్వరరావు(ఎల్‌విఆర్) సభ్యులు డాక్టర్ లంక వెంకటేశ్వర్లు, జిల్లెలమూడి వరప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు అంబికా రాజా, సహాయ కార్యదర్శి సిహెచ్ సాయి తేజ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కార్యనిర్వాహక కమిటీ సహాయ కార్యదర్శి కేబీ రావు, కోశాధికారి గాదంశెట్టి శ్రీనివాసరావు, పుల్లాబోట్ల పురుషోత్తం పాల్గొన్నారు.

●లింగపాలెం: తెలుగు గొప్పతనాన్ని చాటిచెప్పిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని లింగపాలెం మండలంలోని శ్రీవిద్యా పాఠశాలలో నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు చలసాని రత్నాకర్ మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని తెలియజేశారు. సాయిసునంద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పెదపాడు: పెదపాడు జడ్పీ హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా బండారు కౌటిల్య అనే విద్యార్థి గిడుగు రామ్మూర్తి వేషాధారణలో ఆకట్టుకున్నాడు. తెలుగు ఉపాధ్యాయులు మధుసూదన రావు, బాపూజీ, చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

● చింతలపూడి: డిగ్రీకళాశాలలో తెలుగు భాషాదినోత్సవం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్యులకు అర్థమయ్యేరీతిలో తెలుగు భాషను ఆధునీకరించారని అన్నారు.

● పెదవేగి: మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని పెదవేగి ఎంఈవో -1 బి.త్రిపురసుందరిదేవి అన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని పెదవేగి మండలం కొప్పుల వారిగూడెం పంచాయతీ నాగన్నగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈవో త్రిపురసుందరిదేవి అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు తులసి, స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు. కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఆర్.శైలజ, పీడీ ఎం.మల్లిఖార్జునరావులు తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం: అమ్మప్రేమ ఎంత మధురమే మాతృభాష కూడా అంతే మధురమని స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం పి.సోమశేఖర్ అన్నారు. శుక్రవారం మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సంయుక్తంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు హెచ్‌ఎం సోమశేఖర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శివ ప్రసాద్, ఎం.ఎ.నబీ, పీడీ సాయి శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, మెట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్తుపల్లి జీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఆచార్యులు డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ వార్తా పత్రికలు ప్రతి ఒక్కరూ చదవాలన్నారు.

● కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది సంయుక్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, అధ్యాపకులు జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, ధారావతు మల్లేష్, రాజు, పి.ఏడుకొండలు, ఎం.విజయ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలి



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఇన్‌చార్జి డీఎస్‌డీవో షేక్ సిరాజుద్దీన్ అన్నారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కుసుమ అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో మేర యువ భారత్ ఏలూరువారి సహకారంతో మమత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫైన్ ఆర్గనైజేషన్ ఎన్‌జీవో జోనెక్స్, మమత ఆర్గనైజేషన్ డైరెక్టర్ కె.రాణి పాల్గొన్నారు.

● లింగపాలెం: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని లింగపాలెం మండలం కలరాయనగూడెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ధ్యాన్‌చంద్‌ను స్మరించుకోవాలన్నారు.

ఘనంగా గణేశ్ ఉత్సవాలు



పూజలు చేస్తున్న మేయర్ దంపతులు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో గణేష్ నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. పవర్‌పేటలోని విజయగణపతి ఆలయంలో స్వామికి నగరమేయర్ షేక్ నూర్జహాన్ దంపతులు పంచామృత అభిషేకాలు జరిపారు. సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ మహిళలతో సామూహిక రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన జరిపించారు.

నిరుద్యోగ యువత కోసమే జాబ్‌మేళా

- ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బిషప్ జయరావు

పెదవేగి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య నభ్యసించిన యువత సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం విజయరాయిలోని జైసాల్ శిక్షణ కేంద్రంలో ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ ఏలూరు మేత్రాసనం పరిధిలో ఉన్నత విద్య అభ్యసించిన యువతను దృష్టిలో పెట్టుకుని ఈ మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. ముంబై ఆర్చ్ బిషప్ కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేసియస్ మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలన్నారు. ముంబై హైకోర్టు అడ్వకేట్ జాకీమ్ ఎఫ్ రేస్ ఏలూరు పీఠం పరిధిలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి అభినందించారు. వివిధ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులకు ఉద్యోగావకాశాలను కల్పించారు. ముంబై అగ్ర పీఠాధిపతి కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేసియస్‌ను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి, ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. సాంఘిక సేవా కేంద్రం డైరెక్టర్ ఫాదర్ టి.ఇమ్మానియేల్, ఏలూరు పీఠవికార్ జనరల్ ఫాదర్ పి.బాల, సోషల్ సర్వీస్ సెంటర్ వైస్ చైర్మన్ ఫాదర్ బి.రాజు, ఏలూరు కథోలికా మహాదేవాలయం విచారణకర్తలు ఫాదర్ మైఖేల్, ఫాదర్ మరియా జోజి, ఫాదర్ స్టీవెన్, ఫాదర్ ఆనంద్ ప్రకాష్, ఫాదర్ దివాకర్, ఫాదర్ అనిల్, గురువులు, మఠకన్యలు పాల్గొన్నారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న అనూరాధ

పారిశుధ్యాన్ని మెరుగు పరచాలి

కామవరపుకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ హెచ్చరించారు. శుక్రవారం డీపీవో కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో పారిశుధ్య పనుల ప్రగతిపై ఆరాతీశారు. గ్రామంలో మంచి నీటి సదుపాయాలను తనిఖీ చేశారు. డీపీవో వెంట ఎంపీడీవో ఎం.సరళ కుమారి, కార్యదర్శి బ్రహ్మయ్య, వీఆర్వో వెంకన్నబాబు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి

చింతలపూడి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపైన సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుంటే ఉచితంగా ఇంటికి విద్యుత్ వస్తుందన్నారు. సబ్సిడీపై బ్యాంక్ రుణం కూడా అందిస్తుందన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ వలన అనేక ప్రయోజనాలున్నాయన్నారు.అనంతరం దరఖాస్తు చేసే విధానాన్ని లబ్ధిదారులకు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ట్రాన్స్‌కో డీఈ పీర్‌అహ్మద్, పి.అంబేద్కర్, నాయకులు కె.కిషోర్, రామచంద్రరాజు, సిహెచ్ రాయలింగేశ్వరరావు, రాజ్‌పాల్, ధర్మరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

సారథ్యం కార్యక్రమం విజయవంతం చేయాలి

టి.నర్సాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సారథ్యం కార్యక్రమం విజయవంతం చేయాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ చిటికెన రమేశ్ తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షులు దామిశెట్టి సాయివిశ్వనాథ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల ఇన్‌చార్జ్ రమేశ్ మాట్లాడుతూ కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపేందుకు రథసారథి, రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సారథ్యం కార్యక్రమం అన్ని జిల్లాల్లో విజయవంతం అవుతుందన్నారు. సారథ్యం కార్యక్రమం ద్వారా కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపుతూ భరోసా ఇస్తూ ముందుకు సాగుతూ యాత్ర ఏలూరు జిల్లాలోకి సెప్టెంబర్ 3న ప్రవేశిస్తుందన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సాయివిశ్వనాథ్, హరిబాబు, కేశవరావు, ఎం.శ్యామ్ సుందరరావు, సాదు వరప్రసాద్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు సర్వీసు

ద్వారకాతిరుమల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం నూతన బస్సు సర్వీసు శుక్రవారం నుంచి ప్రారంభించంతో సి.హెచ్.పోతేపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీయూపీ మోడల్ పాఠశాలలో 6,7,8 తరగతులను జి.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. ఆ పాఠశాలకు నిత్యం 40 మంది విద్యార్థులు వెళ్లాల్సి ఉంది. వారికి రవాణా సౌకర్యం నిమిత్తం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకెళ్లడంతో జంగారెడ్డిగూడెం డిపో బస్సును సి.హెచ్.పోతేపల్లి వరకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం బస్సు రావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కల్తీ పెట్రోల్‌పై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్న బంక్ యజమానిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కొందరు వాహనదారులు బంక్ ఎదుట ఆందోళన చేశారు. కల్తీ పెట్రోల్ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రం సమీపంలోని కన్నాపురం వెళ్లే రహదారిలో ఉన్న ఒక పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని దాని వల్ల తమ వాహనాలు పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బంక్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేశారు.

భావాజీ మఠాన్ని కాపాడాలి

ఏలూరు అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హతీరామ్ భావాజీ మఠాన్ని కూల్చాల్సిందేనని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన శ్రీనివాసానంద సరస్వతి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బంజారాలందరికీ క్షమాపణలు చెప్పాలని లంబాడీ సుగాలి సంక్షేమ సంఘం నాయకులు బి.నాగేశ్వరరావు నాయక్, జి.కృష్ణ నాయక్, తదితరులు డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని మఠాన్ని, ఆస్తులను కాపాడటానికి చర్యలు తీసుకోవాలన్నారు.

అటవీ శాఖ కార్యాలయం ప్రారంభం

కుక్కునూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులో నూతనంగా నిర్మించిన అటవీ శాఖ కార్యాలయాన్ని రేంజ్ అధికారిని కృష్ణవేణి శుక్రవారం ప్రారంభించారు. గతంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో మరలా నిధులు వెచ్చించి భవన నిర్మాణం జరిపారు. డిప్యూటీ రేంజ్ అధికారులు కేసరి, అశోక్, పలు పార్టీల నాయకులు ములిశెట్టి నాగేశ్వరరావు, యుగంధర్, లక్ష్మణాచార్యులు, కొన్నేలక్ష్మయ్య, వై.నాగేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద స్నానాల గదిలో ప్రమాదవ శాత్తు కాలుజారి తలకు బలమైన గాయమై అనారోగ్యానికి గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ నెహ్రూనగర్‌కు చెందిన పెద్ది రాంబాబు(42) ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య పిల్లలు ఉన్నారు. రెండు రోజుల క్రితం ఇంటి వద్ద బాత్‌రూమ్‌లో ప్రమాదవశాత్తు కాలు జారడంతో తలకు బలమైన గాయమై ఫిట్స్‌వచ్చాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈసంఘటనపై రూరల్ ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షేత్రంలో భారీ అన్నసమారాధన

ద్వారకాతిరుమల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక చెరువువీధిలో భారీ అన్నసమారాధనను నిర్వహించారు. 41వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివద్ద నివేదన సమర్పించారు.అనంతరం ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మొగతడకల శ్రీనివాసరావు, ఓం ప్రకాష్ చౌదరిలు భక్తులకు స్వామివారి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.



విద్యార్థులకు కంచాలు పంపిణీ

భీమడోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అన్నేవారిగూడెం ఎంపీ పాఠశాల విద్యార్థుల పట్ల దాతలు చూపుతున్న ఔదార్యం అభినందనీయమని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల విద్యార్థులకు 100 మందికి దాతలు నీలం శ్రీనివాసరావు, పోలనాటి శ్రీనివాసరావు, అన్నెం రాంబాబుల ఆర్థిక సాయంతో భోజనం ప్లేట్లు అందజేశారు.దాతలను సత్కరించారు. హెచ్‌ఎం కొండయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల పరిశీలన

భీమడోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కురెళ్లగూడెం గ్రామంలోని ఎరువుల దుకాణంలో విజిలెన్సు అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణ ట్రేడర్స్‌లో స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. దుకాణంలో 140 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువుల స్టాక్ తేడా ఉండటాన్ని గమనించగా టెక్నికల్ ఇబ్బందుల కారణంగా ఈ పోస్ మిషన్‌లోకి నమోదు కాకపోవడాన్ని గమనించారు. విజిలెన్సు ఎస్ఐ కె.సీతారాముడు, ఏవో ఉషారాణి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

లింగపాలెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం అన్నపునేనివారిగూడెం గ్రామానికి చెందిన బొడ్డు విశ్వేశ్వరరావు అనే వ్యక్తికి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో అత్యవసర చికిత్స చేయించారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు తెలియజేయగా రూ.6,15,400 ఎల్‌వోసీ లెటర్‌ను అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ లైన్ల మార్పు కోసం సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జీటీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు కైకలూరు మండలంలోని పల్లెవాడ, వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా రైతులు గమనించి సహకరించాలని కోరారు.

జాబ్ మేళాలో 65 మందికి ఉద్యోగాలు

కైకలూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అనేక పరిశ్రమలను తీసుకువస్తుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. 154 మంది యువతీయువకలకు హాజరుకాగా వారిలో 65మంది ఎంపిక అయినట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రవీణ్, టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు నీటి తొలగింపు

నూజివీడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు నూజివీడు పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో మంత్రి కొలుసు పార్థసారథి కార్యాలయం స్పందించింది. నీట మునిగిన ప్రాంతాలను గుర్తించి నిలిచిన నీరు తొలగించేందుకు రెండో రోజు శుక్రవారం సైతం చర్యలు చేపట్టింది. నూజివీడు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన ఎమ్మార్ అప్పారావు కాలనీతో పాటు మొగలిచెరువు సమీప ప్రాంతాలైన పలు వార్డులలో, బాపూనగర్‌లోని కొన్ని గృహాల్లో వర్షపునీరు చేరడంతో వాటిని గుర్తించి కాలువలకు అడ్డుపడిన చెత్తాచెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి నీటిని బయటకు వెళ్ళేలా చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన దోబీఖానాను సైతం శుభ్రపరిచి వినియోగంలోకి తీసుకువచ్చారు. నూజివీడు పెద్దచెరువు తూమును వర్షాకాలం నేపథ్యంలో కట్టి ఉంచటం మరువడంతో భారీ వర్షానికి చేరిన నీరు ఒక్కసారిగా 32వ వార్డులోకి రావడంతో ఆ వార్డు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం తూమును కట్టివేయడంతో పాటు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో వార్డులోని గృహాలు ముంపు నుంచి కోలుకున్నాయి.

వేల్పుచర్లలో కొనసాగుతున్న వైద్య శిబిరం

ముసునూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల ఎస్సీ కాలనీలో డెంగీ కేసులు నమోదు కావడంతో శుక్రవారం జిల్లా వైద్యాధికారులు పారిశుధ్యం, వైద్య శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పీఎస్ఎస్ ప్రసాద్, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ ఇంటింటికి వెళ్ళి నీటితొట్టెల్లో నీరు, పరిశుభ్రతను పరిశీలించి, దోమల నిల్వల ప్రదేశాలను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాలు వస్తే వైద్య ఆరోగ్య సిబ్బందిని కలుసుకుని చికిత్స పొందాలన్నారు. దోమల నిల్వ ప్రదేశాల్లో నివారణ మందును పిచికారి చేసి, ఫీవర్ సర్వేను నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. రెండో రోజు వైద్యశిబిరంలో వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి, సిబ్బంది వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు.

చెరువు వేలంను అడ్డుకున్న గ్రామస్థులు

మండవల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరం గ్రామంలో అంకాలమ్మ పంచాయతీ చెరువును మంచినీటి చెరువుగా చేస్తానని చెరువుగట్టుపై వాటర్ ప్లాంట్ పెడతామని హామీ ఇచ్చి మరలా చేపలచెరువు వేలంపాట నిర్వహణకు సిద్ధం చేయడంతో గ్రామస్థులు ఆగ్రహించారు. శుక్రవారం వేలం నిర్వహించేందుకు సచివాలయానికి వచ్చిన అధికారులను గ్రామస్థులు నిలదీశారు. వైసీపీ సర్పంచ్ గన్నవరం గ్రామంలో పంచాయతీ ఎన్నికల సందర్భంలో సర్పంచ్‌గా ఏకగ్రీవం చేయడం ద్వారా పంచాయతీకి వచ్చిన నిధులతో అంకాలమ్మ చెరువును మంచినీటి చెరువుగా మార్చి అక్కడ వాటర్ ప్లాంట్ కడతానని హామీ ఇచ్చి ఇప్పుడు వేలం నిర్వహించడంపై గ్రామస్థులు వేలంపాటలను అడ్డుకున్నారు. అనంతరం ఈ చెరువును మంచినీటి చెరువుగా ఉపయోగించాలని వేలంపాటలు నిర్వహించరాదని అర్జీని పంచాయతీ కార్యదర్శికి ఇచ్చారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి కొండలు, గన్నవరం నీటి సంఘం అధ్యక్షులు బాలకోటేశ్వరరావు, పంచాయతీ మెంబర్ ముచ్చర్ల కృష్ణమూర్తి కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై సమాచారమివ్వండి

నూజివీడు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై నూజివీడు ఎన్టీఆర్ కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్ న్యాయవాది నందూరి పద్మాంజలి మాట్లాడుతూ ఎర్లీ ప్రెగ్నెన్సీ వల్ల రక్తహీనత ఏర్పడి, తల్లీబిడ్డలు మృత్యువాత పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. బాల్యవివాహాలు ఎక్కడైనా జరిగితే అంగన్‌వాడీ, పోలీస్ అధికారులకు తెలపాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి, ఎన్టీఆర్ కాలనీ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు రఘుబాబు, నాగమల్లేశ్వరరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ క్షేత్రప్రచారక్ భరత్‌జీ

కైకలూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆదర్శవంతమైన హిందూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని ఆర్ఎస్ఎస్ మూడు రాష్ట్రాల క్షేత్రప్రచారక్ భరత్‌జీ అన్నారు. శుక్రవారం లోకుముడి దత్తాశ్రమంలో ఆర్ఎస్ఎస్ కైకలూరు ఖండ ఆధ్వర్యంలో పంచ్ పరివర్తన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అక్టోబరు 2 నుంచి శతజయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ సంప్రదాయాలు ప్రపంచంలోని అనేక దేశాలు ఆచరిస్తున్నాయన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ 42 క్షేత్రాలు ఉన్నాయని రాష్ట్రంలో 1600 శాఖలు ఉన్నాయని వీటిలో అనేక పాఠశాలలను ఏర్పాటుచేసి పిల్లలను ఉత్తమపౌరులుగా క్రమశిక్షణతో శిక్షణ ఇస్తున్నారన్నారు. కైకలూరు ప్రముఖులు జంపన రామలింగరాజు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, జిల్లా విభాగ ప్రచారక్ నవీన్‌జీ, జిల్లా విభాగ్ కార్యవాహ మేడిశెట్టి పాములు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ఎవరు?

(5వ పేజీ తరువాయి)

బాధ్యతలను భుజానెత్తుకోవడానికి సుముఖంగా లేరు. పార్టీ నాయకత్వం పట్టుబడితే ఆయన కూడా మెత్తబడే అవకాశం లేకపోలేదు. దీనికి తోడు బీసీ సామాజికవర్గం నుంచి అధికార ప్రతినిధి శ్యామ్‌చంద్ర శేషు కూడా పోటీ పడుతున్నారు. ఆయన యువత, బీసీ కోటాలో ప్రాధా న్యత లభిస్తుందని ఆశతో ఉన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులంతా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే. కానీ గౌడ సామాజిక వర్గం నుంచి తనకు ప్రాధాన్యత ఇవ్వాలని శేషు కోరుకుంటున్నాడు. మరోవైపు ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కు అవకాశం లేకపోతే తమకు అవకాశం ఇవ్వాలని కోరే వారి సంఖ్య పెరుగు తోంది. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ కూడా తనకు ఒక ఛాన్స్ ఇస్తే సమర్థతను నిరూపించుకుంటానని చెబుతున్నారు. దీనికి తోడు ఇప్పుడున్న పరిస్థితుల్లో అన్ని నియోజకవర్గాల్లో కేడర్‌ను సమన్వయం చేయడంలో తాను ఇప్పటికే సక్సెస్ అయ్యాయని గన్ని బలమైన అభిప్రాయంతో ఉన్నారు. ఈ కారణంగానే తనను మరో సారి కొనసాగించేందుకు అధినాయకత్వం నిర్ణయం తీసుకోవచ్చుననే ఆశతో ఉన్నారు. నూజివీడు నియోజకవర్గానికి చెందిన అట్లూరి రమేష్ సైతం సీనియర్లతో భేటీ అయ్యారు. తనకు అవకాశం ఇస్తే పార్టీ కార్యక్రమాలను మరింత బలంగా గ్రామస్థాయి వరకు తీసుకువెళతానని వాదన వినిపిస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో తాను సేవా కార్యక్రమాలను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన రామ్‌కుమార్, ఉంగుటూరుకు చెందిన రెడ్డి చందు కూడా తమకు ఒక అవకాశం ఇవ్వాలని గట్టిగానే పట్టుబడుతున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి జడ్పీ మాజీ చైర్మన్ కొక్కిరగడ్డ జయరాజు, దాసరి ఆంజనేయులు సైతం ఇప్పటికే రేసులో ఉన్నారు.

పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ

కొత్త జిల్లా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఎప్పటిలోగా పూర్తవుతుందనే దానిపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. జిల్లా పరిశీలకులు ఇచ్చిన తొలి ఐదు పేర్లను పరిగణనలోకి తీసుకుని ఆ మేరకు అధినాయకత్వం అన్ని విషయాలను క్షుణ్ణంగా శోధించి తుది నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు. తొలి ఐదు పేర్లలో ఎవరెవరున్నారనే దానిపై మాత్రం పార్టీలో రకరకాల పేర్లు షికార్లు చేస్తున్నాయి. కాపు సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యే చంటి పేరు తొలి వరుసలో ఉందని చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

అదే నిర్లక్ష్యం..!

32వ వార్డులోకి చేరిన నూజివీడు పెద్ద చెరువు నీరు


32వ వార్డులోకి చేరిన పెద్ద చెరువు నీరు

నూజివీడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత అనుభవాలతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం అనే మాటలు కేవలం నోటిమాటలయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో పడిన భారీ వర్షాలకు నూజివీడు పెద్దచెరువు మూడుచోట్ల గండ్లుపడి పట్టణంలోని సగభాగం దాదాపు మూడు రోజుల పాటు నీటమునిగింది. వందల ఎకరాల్లో పంట నష్టంతో పాటు నివేశనా గృహాలు సైతం నష్టపోవడంతో పట్టణంలోని బాలికోన్నత పాఠశాల, బాలుర పాఠశాల తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా శిబిరా లను సైతం ఏర్పాటు చేశారు. చెరువు నీరు మొత్తం ఖాళీ అయిన తరువాత యుద్ధప్రా తిపదికన చెరువు గండ్లను పూడ్చేందుకు చర్యలు చేపడుతున్నా మంటూ నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చేసిన ప్రకటనను అధికారులు ఆచరణలోకి తీసుకుని రాలేదు. ఫలితంగా చెరువులో నీరు చేరక, మండు వేసవి లో సైతం కనీసం పశుపక్ష్యాదులకు సైతం నీరందని పరిస్థితి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' పలు మార్లు కథనాలను ప్రచురించడంతో ఎట్టకేలకు ఇరి గేషన్ అధికారులు, ఓ కాంట్రాక్టర్‌తో గండ్లను అదే చెరువులోని మట్టితో పూడ్చి మమ అనిపించారు. చెరువుకట్ట పరిస్థితులు, తూములు ఎలా ఉన్నాయి అనే పర్యవేక్షణ సైతం గాలికి వదిలేశారు. ఏడాది గిర్రున తిరిగొచ్చింది. మళ్లీ ఆగస్టులోనే నూజివీడు పట్టణంలోని 32వ వార్డుకు ముంపు తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు కారణం చెరువుకు ఉన్న తూముల షట్టర్లు సరిగా ఉన్నాయా? లేక? మరమ్మతులు చేయాలా? లేక? కొత్తవి ఏర్పాటు చేయాలా? అనే అంశాలను గమనించకుండా వదిలివేయటమే. రెండు రోజులుగా భారీ వర్షాలు పడటంతో చెరువుకు నీటిని అందించే వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో చెరువులోకి వచ్చే నీరు వచ్చినట్లుగా తూముగుండా 32వ వార్డును ముంచెత్తింది. దీంతో అధికార యంత్రాంగం, మంత్రి కార్యాలయం నిర్ఘాంతపోయి నష్టనివారణ చర్యలను చేపట్టారు. తూము కట్టివేయని పరిస్థితిని తొలుత ఆంధ్రజ్యోతి మంత్రి కార్యాలయ సిబ్బందికి చేరవేయడంతో వారు హుటాహుటిన తూము వద్దకు చేరుకుని తూమును తాత్కాలికంగా కట్టివేసే చర్యలను చేపట్టారు. దీంతో 32వ వార్డు ముంపు నుంచి బయటపడింది.

లాల్వ డ్రెయిన్‌పై శాశ్వత వంతెన నిర్మాణం : కామినేని


లాల్వ డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): లాల్వ డ్రెయిన్‌పై త్వరలో శాశ్వత వంతెన నిర్మి స్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్ర వారం కలిదిండి శివారు ఇందిరా కాలనీ సమీ పంలో లాల్వ డ్రెయి న్‌పై కూలిన రహదారిని పరిశీలించి మాట్లాడుతూ వైసీపీ హయాంలో నాలు గేళ్ల క్రితం శిథిలావస్థలో ఉన్న వంతెన కూలిపోయిందని ప్రత్యామ్నా యంగా లాల్వ డ్రెయిన్‌లో తూములు ఏర్పాటు చేసి తాత్కా లికంగా రహదారి నిర్మించి వదిలే యటంతో రహదారి కూలిందన్నారు. శాశ్వత వంతెన నిర్మా ణానికి రూ. 2.5 కోట్లు అంచనా వేసి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపించా రన్నారు. నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మాణ పనులు చేపడతామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే చొరవ తో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా లాల్వ డ్రెయిన్‌పై తూములు ఏర్పాటు చేసి కంకరతో యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక రహదారిని నిర్మించా రు. దీంతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు అండ్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, ఆర్ అండ్ బీ ఏఈఈ భాస్కర్, కలిదిండి సర్పంచ్ ఎం.మారుతి ప్రసన్న పాల్గొన్నారు.

ముంపు సమస్య తొలగించేందుకే డ్రెయిన్ల అభివృద్ధి..

కైకలూరు: నియోజకవర్గంలో ఎక్కడా ముంపు సమస్య లేకుండా డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం వరహాపట్నం శివారు దమ్మిడి డ్రెయిన్ పూడికతీత పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ వైసీపీ హయాంలో అన్ని రంగాల్లో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిం దని, డ్రెయిన్ల ప్రక్షాళన నిర్వీర్యం అయిందన్నారు. అందువల్ల ఎక్కడి కక్కడ ముంపు సమస్యలు తలెత్తుతున్నాయని, కూటమి ప్రభుత్వం గ్రామాలకు కానీ, పంటలకు గానీ ముంపు లేకుండా చేయాలనే డ్రెయిన్ల ఆధునికీకరణ చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అనేక డ్రెయి న్లను అభివృద్ధి చేశామని దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు సమస్య తలెత్తకుం డా రైతులు పంటలను కాపాడుకున్నార న్నారు. డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, టీడీపీ మండల అధ్యక్షు డు పెన్మెత్స త్రినాథరాజు తదితరులు పాల్గొన్నారు.


తుమ్మగూడెంలో గిడుగు చిత్రపటం వద్ద నివాళి


భైరవపట్నంలో తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం


పెదపాలపర్రు హైస్కూల్‌లో తెలుగుతల్లి వేషధారణ

కమ్మనైనది అమ్మభాష

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు

చాట్రాయి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం దళితవాడ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషను సామాన్యులకు చేరువ చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి హెచ్‌ఎం గంపా వెంకట్రావు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తెలుగు అమ్మ భాష అని, అమ్మని, అమ్మ భాషను మర్చిపోతే మనుగడ ఉండదన్నారు. ప్రస్తుతం తెలుగు మాట్లాడటం నామోషీగా కొందరు భావించటం ఆందోళన కలిగించే విషయమని, ఎంతో మంది చరిత్రకారులు తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా అభివర్ణించారని అన్నారు.

ముసునూరు: చెక్కపల్లి జడ్పీ పాఠశాల, ముసునూరు భారతీయ విద్యానికేతన్ హై స్కూల్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఎంహెచ్ అల్లా భక్షు, ప్రిన్సిపాల్ కొండేటి శౌరి నివాళులు అర్పించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్యాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పద్మకిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: అన్నవరం జడ్పీ హైస్కూ ప్రధానోపాధ్యాయిని విజయ్ కుమారి గిడుగు రామ్మూర్తికి నివాళులర్పించగా, నూజివీడు మండలం మద్దాయికుంట పాఠశాలలో హెచ్‌ఎం భాస్కర్‌రావు తదితరులు తెలుగుభాష ఔన్నత్యాన్ని వివరించారు. ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని ఎస్‌పీఎఎం ఐటిఐ కళాశాలలో ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వికాస్ కళాశాలలో కరస్పాండెంట్ మదన కిషోర్, ప్రిన్సిపాల్ కొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో తెలుగు భాషా నిపుణులైన టీచర్లను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు సన్మానించారు. ఈ సంద ర్భంగా తెలుగు భాషా ప్రావీణ్యతపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బీజేపీ నాయకులు సత్యవోలు నాగలక్ష్మి, వత్తుమిల్లి ప్రసాద్, కొల్లిపర నాగరాజు తదితరులు బహుమతులు అందజేశారు. పెదపాలపర్రు హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎస్.లక్ష్మీ రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించా రు. తెలుగు తల్లి వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. రిటైర్డ్ డీఐఈవో గన్నమనేని వెంకటే శ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: దేశ భాషలందు తెలుగు లెస్స అని సాక్షాత్తు శ్రీకృష్ణదేవరాయలు పొగిడారని, తెలుగు భాష ఎంతో మధురమని భైరవపట్నం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

పారని మురుగు..


చెట్లతో మూసుకుపోయి, గుర్రపుడెక్కతో నిండిపోయిన చిన కొమ్మిలేరు మీడియం డ్రెయిన్

భారీ వర్షాలొస్తే పంట మునకే!
20 ఏళ్లుగా పూడిక అంతంత మాత్రమే
అధ్వానంగా చినకొమ్మిలేరు మీడియం డ్రెయిన్

ముదినేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాల పంట భూములకు మురుగునీటి పారుదల సౌకర్యం కల్పించే చిన కొమ్మిలేరు మీడియం డ్రెయిన్ అధ్వానంగా మారింది. పూర్తిగా పూడిపోయి, గుర్రపుడెక్క, తూటుకాడ నిండిపోవడంతో డ్రెయిన్‌లో నీరు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు మండలాలకు చెందిన సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ మీడియం డ్రెయిన్ మురుగునీటి పారుదల సౌకర్యం కల్పిస్తున్నది. ముదినేపల్లి వద్ద ప్రారంభమై తామరకొల్లు వద్ద పెద కొమ్మిలేరు మేజర్ డ్రెయిన్‌లో కలిసే వరకు సుమారు 20 కిలోమీటర్ల దూరం పూడిపోయింది. డ్రెయిన్ వెంబడి పెరిగిన పెద్ద వృక్షాలు కూడా ఒరిగి డ్రెయిన్‌లోపడిపోయాయి. సుమారు 20 ఏళ్లుగా డెక్క, తూడు తొలగింపు పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. దీంతో భారీ వర్షాలకు వేలాది ఎకరాల ఆయకట్టు ఖరీఫ్ సీజనులో ముంపునకు గురవుతోంది. వరి పంటను చేతికి దక్కించుకునే పరిస్థితి లేదు. ఈ మీడియం డ్రెయిన్ పూడిపోవడం వల్ల దీనికి అనుబంధంగా ఉన్న మరో డ్రెయిన్ పొంగి వర్షాల సమయంలో ముదినేపల్లి, పెయ్యేరు కాలనీ కూడా ముంపునకు గురవుతోంది. డ్రెయిన్‌లోని గుర్రపుడెక్కనైనా తొలగించేందుకు అధికార్లు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా గణపతి నవరాత్రులు

కలిదిండి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణనాథుడి విగ్రహం వద్ద హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే పెదలంక, మూల్లంక, భాస్కరావుపేట, గుర్వాయిపాలెం, వెంకటాపురం, కోరుకొల్లు, తాడినాడ, మట్టగుంట, కొండంగి గ్రామాల్లో నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముదినేపల్లి: చినకామనపూడి, నరసన్నపాలెం, మీగడపాలెం వారిపాలెం గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలను నిర్వహించారు. ఎస్‌ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఏ.శ్రీనివాస్, హెచ్‌సిలు శంకరరావు, సుధావాణి బందోబస్తు నిర్వహించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే

మండవల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాద సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని ఎస్సై రామచంద్రరావు స్పష్టం చేశారు. మండలంలోని లోకుముడి సెంటర్లో శుక్రవారం ఆయన వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు సంభవించి వాహనదారులు తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగి మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులే ఎక్కువ శాతం ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. హెల్మెట్ ధరించని వాహనపత్రాలు లేని 11 మంది వాహనదారులపై రూ.4735 చలానా విధించినట్లు తెలిపారు.

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా..
7న శ్రీవారి ఆలయం మూసివేత
8న ఉదయం 9.30 గంటల నుంచి సర్వదర్శనం



ద్వారకాతిరుమల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని వచ్చేనెల 7వ తేదీన మధ్యాహ్నం నుంచి మూసివేస్తామని దేవస్థానం ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆ రోజు మహానివేదన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కవాటబంధనం జరుగుతుందని భక్తులు గమనించాలని కోరారు. ఆ తరువాత రోజు 8వ తేదీన పుణ్యాహవాచనం అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శన అనుమతి లభిస్తుందని ఆలయ ప్రధాన అర్చకులు సూచించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 7న సాయంత్రం శ్రీవారికి జరిగే ఆర్జిత సేవలు, 8న ఉదయం సుప్రభాత సేవలు రద్దు అవుతాయని అన్ని సేవలు యథావిధిగా జరుగుతాయని భక్తులు గమనించాలని కోరారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.10.02 లక్షలు విరాళం

చినవెంకన్న ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన, గోసంరక్షణ పథకాలకు ఓ దాత కుటుంబం శుక్రవారం రూ.10,02,232లను విరాళంగా అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన పద్మలత పరమేశ్వరన్ ఈ విరాళంలో భాగంగా నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5,01,116, గోసంరక్షణ ట్రస్టుకు మరో రూ.రూ.5,01,116 మొత్తం .రూ.10,02,232లను ఆలయ కార్యాలయంలో జమ చేశారు.

రాజధాని నిర్మాణానికి ఎన్ఆర్ఐ రూ. 10,116 విరాళం

ముదినేపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని నిర్మాణానికి నిధుల సేకరణకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్, ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ప్రజలం దరినీ రాజధాని నిర్మాణంలో భాగస్వాములను చేసే లక్ష్యంతో ఒకొక్కరు రూ. 116లు విరాళం ఇవ్వా లని వైష్ణవి ఇచ్చిన పిలుపునకు స్పందన లభిస్తున్నది. ఇప్పటికే వివిధ ప్రాంతాలకు చెందిన వారు రూ.116 నుంచి రూ. 5116వరకు ఏపీ సీఆర్‌డీఏ అకౌంట్‌కు పంపగా, శుక్రవారం ముదినేపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గూడవల్లి వెంకట సత్యకుమార్ రూ.10,116లు విరాళంగా ఇచ్చారు. ఆయన ఈ మొత్తాన్ని అమెరికా నుంచి సీఆర్‌డీఏ క్యూఆర్ కోడ్ ద్వారా అకౌంట్‌కు పంపారు.

లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని ధర్నా

ముసునూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట దళితవాడలో లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని సబ్ స్టేషన్ వద్ద కాలనీ వాసులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ దళితవాడ నుంచి బీసీ కాలనీకి విద్యుత్ లైన్ వెళ్ళిందన్నారు. అయితే కాలనీలో ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడటంతో లోవోల్టేజ్ సమస్య ఏర్పడి ఇళ్ళలో ఫ్యాన్‌లు, ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి సరిగ్గా పనిచేయక కాలిపోతున్నాయని ఆరోపించారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని, సమస్య పరిష్కారానికి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్‌కు వినతపత్రం అందజేశారు. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో క్వాంటం హ్యాకథాన్

నూజివీడు టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలో గల నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్వాంటమ్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించి వివిధ అంశాలపై ఈ హ్యాకథాన్‌ను నిర్వహించగా, దాదాపు 33 టీంలు రిజిస్టర్ అయ్యాయి. 29 టీమ్‌లు 10 అంశాలకు సంబంధించి తమ ఐడియాలజీని అధికారిక పోర్టల్లో సమర్పించగా, 25 టీమ్‌లు హ్యాకథాన్‌లో పాల్గొని తమ సృజనాత్మకతలను ప్రదర్శించాయి. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించి ఫ్రాడ్ డిటెక్షన్, స్ట్రీట్ ఆప్టమైజింగ్, క్వాంటమ్ కీ, డిస్ట్రిబ్యూషన్ తదితర అంశాలపై ఈ హ్యాకథాన్‌ను నిర్వహించగా, ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచిన ఐదు టీంలను ఎంపిక చేశారు. కాగా ప్రతిభ కనబరి చిన టీంలు అమరావతి, క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్, 2025లో ఆర్జీయూకేటీకి ప్రాతినిధ్యం వహించనున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన ఉండాలి

చాట్రాయి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా సర్కార్ పాఠశాలలో నాణ్యమైన బోధన ఉండాలని ఎంఈవో-1 ఎం. శ్రీనివాస్ ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. పోతనపల్లి, పర్వతాపురం, సి. గుడిపాడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం, రికార్డులు తనిఖీ చేశారు. వంట గదులను ఎప్పటికప్పుడు శుభ్రం చెయ్యాలని ఆదేశించారు.

రూ. 1.20 లక్షలు పలికిన లడ్డూ

ముసునూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుల నిమజ్జనం జరిగింది. కాట్రేనిపాడులో టీడీపీ నాయకుడు, వేంపాడు డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి చేతిలోని లడ్డూ ప్రసాదాన్ని బాలకృష్ణ, రాపర్ల ఆదినారాయణ, వెల్ది నాగవర్ధన్, బోయపాటి భాను, నందిగం కిరణ్‌బాబులు రూ. లక్షా 20 వేలకు దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించి, స్వామివారిని ఘనంగా ఊరేగించి తమ్మిలేరులో నిమజ్జనం చేశారు.



ఘనంగా క్రీడా దినోత్సవం

కలిదిండి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. వాలీబాల్, రన్నింగ్, షాట్‌పుట్, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పిరమిడ్ ఆకారంలో విద్యార్థులు విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం స్వర్ణ కుమారి, పీడీ బి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. 20 ఏళ్ల జైలు

ఏలూరు క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష ఐదు వేల రూపాయల జరి మానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి కె.వాణి శ్రీ శుక్రవారం తీర్పు చెప్పారు.ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం సాయంపాలెం గ్రామానికి చెందిన పిల్లే వెంకటేశ్వరరావు అలియాస్ నంద(37)2018 డిసెంబర్ 22న బాలికపై లైంగికదాడి చేశాడు. బాలిక ఏడుస్తూ ఇంటి నుంచి బయటకు రావడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా వెంకటే శ్వరరావు లైంగికదాడి చేసినట్టు గుర్తించారు. దీనిపై జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు టి.నర్సాపురం పోలీసులకు ఆ కేసును అప్పగించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ మురళీకృష్ణ కేసు దర్యాప్తు చేసి ఈ కేసులో నిందితుడైన వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ జరిగింది. నాలుగేళ్ల బాలికపై పిల్లి వెంకటేశ్వరరావు లైంగికదాడి చేసినట్టు నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి వాణిశ్రీ తీర్పు చెప్పారు. బాధితురాలి కుటుంబానికి రూ.50 వేల పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.